జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 30 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 145 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: ప్రథమ - 21:32:37 వరకు నక్షత్రంశ్రావణ - 17:44:08 వరకు కరణంబాలవ - 08:52:55 వరకు, కౌలవ - 21:32:37 వరకు పక్షంకృష్ణ యోగంఆయుష్మాన్ - 24:04:58 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

### కాంగ్రెస్ బిఎల్ఎలకు భట్టి ఆదేశం

న్యూఢిల్లీ,జూలై29(ప్రజాజ్యోతి): ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ

మిగతా 2లో..

## పోలీసులు చట్టప్రకారమే వ్యవహరించారు

### ఖర్గే వ్యాఖ్యలను తిప్పికొట్టిన జెపి నడ్డా

న్యూఢిల్లీ,జూలై29(ప్రజాజ్యోతి): దిల్లీలో నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుబట్టారు. ఈ విషయంపై రాజ్యసభలో మాట్లాడుతూ.. అణచివేతకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్రమంత్రి జేపీ నడ్డా

మిగతా 2లో..

యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్ సభలో ఆమోదం వచ్చింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లు పాసైంది. భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీలను నివారించడానికి కఠినమైన నిబంధనలను అమలు చేయడమే లక్ష్యంగా 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు 2026 రూపొందించారు. ఇక సభ రేపటికి వాయిదా పడింది. కొత్తగా ఆమోదం పొందిన ఈ బిల్లు, పేపర్ లీక్ కేసుల దర్యాప్తును పూర్తి చేయడానికి రెండు నెలల గడువును నిర్దేశించింది. ఇది, అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు 2024 చట్టంలోని ఐదేళ్ల శిక్షను, 50 లక్షల రూపాయల జరిమానాతో పాటు 10 సంవత్సరాలకు పెంచింది. కేసులను మూడు నెలల వ్యవధిలో పరిష్కరించడానికి ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని కూడా ఈ బిల్లు ప్రతిపాదించింది. వ్యవస్థీకృత నేరస్థులకు విధించే గరిష్ట జరిమానాను ప్రస్తుత చట్టంలోని పరిమితి నుండి రూ. 10 కోట్లకు పెంచాలని ప్రతిపాదించారు.

# బిల్లుకు ఆమోదం

## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- వాడీవేడీ చర్చ.. మూజువాణి ఓటుతో ఆమోదం
- విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం
- వందేమాతరం బిల్లుకు రాజ్యసభ ఆమోదం
- అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్షాల వాకౌట్
- బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా
- పేపర్ లీక్‌లకు పాల్పడే వారికి కఠిన శిక్షలు
- విద్యార్థులకు అమిత్ షా అభినందనలు




న్యూఢిల్లీ,జూలై29(ప్రజాజ్యోతి): వాడీవేడీ చర్చలు..విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాల ను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం

మిగతా 2 లో..



## పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ

- రాహుల్ ఈడియట్ పదంపై సభలో గందరగోళం
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికార పార్టీ ఎంపిలు
- పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదు
- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కిరణ్ రిజిజు
- ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు.. భావ వ్యక్తీకరణ
- పేపర్ లీక్‌పై బీజేపీ ఎంపీల పిల్లలనే అడగండి చెబుతారు
- యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చలు రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ,జూలై29(ప్రజాజ్యోతి): లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. విద్యార్థుల ఆందోళనపై లోక్‌సభలో ప్రసంగించిన ఆయన.. ఆర్ఎస్ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సమయంలో ఆయన ఉపయోగించిన ఓ పదంపై తీవ్ర దుమారం రేగింది. రాహుల్ వ్యాఖ్యలపై

మిగతా 2 లో..



# కొలువుల జాతర

- 7,437 పోలీస్ కొలువుల భర్తీ
- నాలుగు నోటిఫికేషన్లు విడుదల
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు
- త్వరలో దరఖాస్తు తేదీల వెల్లడి




హైదరాబాద్,జూలై29(ప్రజాజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ మేరకు పోలీస్‌శాఖలో సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, ఫైర్, జైళ్లశాఖలో పలు ఖాళీల భర్తీకి సంబంధించి 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. త్వరలో దరఖాస్తు తేదీలను ప్రకటిస్తామని పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్ లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపింది. వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని నియామక మండలి తెలిపింది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి విడుదల చేసిన తాజా నియామక నోటిఫికేషన్ ద్వారా ఎంపికయ్యే అభ్యర్థులకు పోస్టును బట్టి ఆకర్షణీయమైన వేతనాలు అందనున్నాయి. పోలీస్ శాఖలోని వివిధ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పోస్టులకు నెలకు రూ.42,300 నుంచి రూ.1,15,270 వరకు పే స్కేల్ ఉండగా, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మరియు డిప్యూటీ జైలర్ పోస్టులకు రూ.38,890 నుంచి రూ.1,12,510 వరకు వేతన శ్రేణి వర్తించనుంది. ఈ నియామకాలకు సంబంధించిన వయోపరిమితి,

మిగతా 2 లో..

## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

### పర్యావరణ అనుమతులు చెల్లుబాటు సుప్రీంలో పాజెక్ట్ పనులకు ఉపశమనం

న్యూఢిల్లీ,జూలై29(ప్రజాజ్యోతి): తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది.

మిగతా 2 లో..

## ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమే

- తొలుత ప్రేమించుకుని దూరమయ్యారు
- అయినా వేధింపులకు దిగిన ట్రైనీ ఐపిఎస్
- నగర్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ వెల్లడి
- ట్రైనీ ఐపిఎస్ కృష్ణరెడ్డికి 14రోజుల రిమాండ్
- చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు



హైదరాబాద్,జూలై29(ప్రజాజ్యోతి): లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో కేసు నేపథ్యాన్ని సీపీ సజ్జనర్ వివరించారు. నిందితుడు, ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేశాడు. అనంతరం యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 2025 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యాడు. 2025 డిసెంబర్ నుంచి శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమిలో శిక్షణ పొందుతున్నాడు. అదే ఏడాది మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిందితుడికి బాధితురాలితో పరిచయం ఏర్పడింది. తన విజయ

మిగతా 2 లో..

## దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

- 48 మంది ఉద్యోగులకు ఈవోలుగా పదోన్నతి
- ప్రభుత్వ పనితీరుకు దేవాదాయ శాఖ పనితీరే నిదర్శనం
- ఉద్యోగుల హక్కులను కాపాడటంలో ముందుంటాం
- దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్తాం
- ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు అవార్డులు, రివార్డులు
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్,జూలై29(ప్రజాజ్యోతి): దేవాదాయశాఖ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలుచేస్తున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు తెలిపారు. ఈ రోజు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్(ఆడిటోరియం వేదికగా జరిగిన ఉద్యోగుల పదోన్నతుల కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరిలో 48 మంది ఉద్యోగులు గ్రేడ్ 3 ఈవోలుగా, ఇద్దరు గ్రేడ్ 2 ఈవోలుగా, ఒకరు గ్రేడ్ 1 ఈవోలుగా మంత్రి సురేఖ గారి చేతుల మీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందుకున్నారు. వీరితో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులకు (వారి కటుంబ సభ్యులు) పదవీ విరమణ, మరణ (గ్రాట్యుటీ, వివాహ రుణం మంజూరు ఉత్వర్వులను మంత్రి సురేఖ గారు అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరెక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ

మిగతా 12 లో..

# జోరు వానలు

- వాయుగుండం ప్రభావంతో విస్తారంగా వర్షాలు
- తెలంగాణలో వానలతో పొంగుతున్న వాగులు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు
- వాగులు, వంకల్లో పెరుగుతున్న వరద నీరు
- వర్షాలతో ఉప్పొంగుతున్న బొగత జలపాతం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వానజోరు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కుండపోత వర్షం
- జిల్లాలో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- రెండు రోజులుగా మెదక్ జిల్లాలో భారీ వర్షాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ జోరు వానలు
- సింగరేణి బొగ్గు ఉత్పత్తికి కలిగిన అంతరాయం



వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గత 20 గంటలుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు, నదులు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో వరద నీటి ఉద్ధృతి కారణంగా రహదారులు దెబ్బతిని, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాష్ట్రంలోని పలు జలాశయాలు నిండుకుండలా మారి అలుగులు పారుతుండగా, వాతావరణ శాఖ అనేక జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.

హైదరాబాద్,జూలై29(ప్రజాజ్యోతి): తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, నదులు, చెరువులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంటలు నీటమునిగాయి. పలు చోట్ల వరద ఉద్ధృతికి రహదారులు కొట్టుకుపోయాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జలాశయాలు నిండి పోయి జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఎడతెగకుండా కురుస్తున్న వర్షాలతో భూపాలపల్లి జిల్లా తడిసిముద్దవుతోంది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ, రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని పేర్కొన్నారు. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ.. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

మిగతా 12 లో..

## అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీసేవ

- డిజిటల్ సేవల విస్తృతి, ప్రమాణ్యాలు పెంచాలి
- అధికారులతో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



హైదరాబాద్,జూలై29(ప్రజాజ్యోతి): ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు మీ-సేవ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.

మిగతా 2 లో..

# సంపాదకీయం

## పరీక్షల బిల్లుతో సమస్య సమిసిపోయేనా?

పిల్లికి చెలగాటం...ఎలుకకు ప్రాణ సంకటం అన్నట్లుగా మన పరీక్షల విధానం మారింది. ఇటీవల నీట్ ప్రవేశ పరీక్షల లీక్‌తో మన పరీక్షల విధానం ఎంత డొల్లగా ఉందో తేలిపోయింది. డబ్బులకు కక్కుర్తి పడే లెక్చరర్లు ఉండడం దౌర్భాగ్యం. విద్యార్థులు ఏమైతేనేమి మనకు కాసులు రాలుతున్నాయని పేపర్లను లీక్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలి నీట్ పేపర్ లీక్‌తో కాక్రోచ్ పార్టీ ఉద్యమించడం, అంతే స్పీడ్‌గా ఇప్పుడు పార్లమెంటులో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ సాగుతోంది. ఈ చర్చలో గమనించిన విషయమేమిటంటే విపక్షాలకు కూడా పకడ్బందీ విధానం ఎలా అమలు చేయాలన్న దానిపై అవగాహన లేదని తేలిపోయింది. చర్చలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ, గగోయ్, అఖిలేశ్ యాదవ్‌లు విమర్శలు చేశారే తప్ప పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అసవరమైన సూచనలు చేయలేక పోయారు. కాక్రచ్ ఉద్యమాన్ని ముందుకేసుకుని ప్రభుత్వాన్ని తూర్పారాబట్టడం మాత్రమే చేస్తున్నారు. పరీక్షలను ఎలా పకడ్బందీగా ఎలా నిర్వహించాలో నిర్మాణాత్మక సూచనలు చేయలేదు. ప్రభుత్వం కూడా ఎంతసేపు శిక్షలపైనే దృష్టి పెట్టింది తప్ప, పరీక్షలను పక్కాగా నిర్వహించడం ఎలా అన్నదానిపై దృష్టి సారించడం లేదు. నిజంగానే ఆదరాబాదరాగా తెచ్చిన ఈ బిల్లులో కఠిన శిక్షలతో పాటు, పరీక్షలను సంస్కరించే విధంగా నిబంధనలు పొందుపర్చాలి. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అయితే మంత్రి రాజీనామాతోనే భ్రష్టుపట్టిన మన దేశ విద్యా వ్యవస్థ మారిపోదు. పరీక్ష పేపర్ లీకేజీలు, అవకతవకలు, అవినీతి వంటి సమస్యలు తొలగిపోవాటంలే పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ఎందుకంటే పేపర్ లీకేజీలకు మూలం డబ్బుల మాయగా ఉంది. ఈజీగా డబ్బు సంపాదించే క్రమంలో ఇలాంటి దురాగతాలకు పాల్పడుతున్నారు. మెడికల్ కాలేజీల ప్రవేశానికి లక్షల మంది రాసే పరీక్షను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చట్టబద్ధతను సమీక్షించాలి. వాస్తవానికి ఎన్టీఏ అనేది ఒక అకడమిక్ బాడీ కూడా కాదని ఎంతమందికి తెలుసు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పాటైన సంస్థ అంతకన్నా కాదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ మాత్రమే అని ఇక్కడ గుర్తించాలి. దానికంటూ స్వతంత్రత, స్వయంప్రతిపత్తి ఏమీ లేవు. అలాంటి సంస్థకు దేశంలోని నీట్‌తో సహా అనేక ప్రవేశ పరీక్షలను, పోటీ పరీక్షలను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. ఈ కారణంగా దేశ విద్యారంగాన్నంతా కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి తెచ్చుకునే అధికారాల కేంద్రీకరణ విధానం. అందువల్లనే పరీక్షలలో అక్రమాలు, అవకతవకలు, అవినీతి వ్యవహారాలు సాగుతున్నాయి. నీట్ కోచింగ్ సెంటర్స్‌ను నిర్వహిస్తున్న వారే నీట్ పేపర్ సెట్టర్స్‌గా అవతారమెత్తారంటే ఎన్టీఏ కేంద్రంగా కోచింగ్ మాఫియా ఏ స్థాయిలో బలంగా వేళ్లూనుకుందో చెప్పవచ్చు. ఈ విధమైన వేల కోట్ల రూపాయల అవినీతి వ్యాపారం సాగుతుఒంది. అధికారుల అండదండలు లేకుండా ఇది జరు9గుతందని అనుకోవడానికి లేదు. అందువల్ల ఈ ఎన్‌టిఎ స్థానంలో ప్రస్తుతం బిల్లు ఏ ర కంగా ఉంటుందో తెలియదు. పార్లమెంటులో చర్చ సాగుతున్నా సీరియస్‌నెస్ కానరావడం లేదు. బిల్లులో కేంద్రాన్ని విమర్శించడం తప్ప నిర్మాణాత్మక సూచనలు చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అయ్యాయి. కావున ఎన్టీఏ ఉనికిని, దాని చుట్టూ బలంగా అల్లుకొని ఉన్న అవినీతి చట్రాన్ని బ్రద్దలు కొట్టాలి. లేదంటే కంటితుడుపు చర్యగా పేపర్ లీకేజీలో దళారి పాత్ర పోషించిన కొద్దిమంది నేరస్తులను బలి ఇవ్వడం, ఎన్టీఏలోని కొద్దిమంది అధికారులను తొలగించడం వంటి కసరత్తుగా మిగిలి పోతుంది. ఇంత ఆగ్రహం, ఆందోళన చెలరేగిన నేపథ్యంలో అసమర్థ ఎన్టీఏను రద్దుచేసి, తిరిగి రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ అడ్మిషన్స్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహించాలనే డిమాండ్ ను కూడా పునఃపరిశీలించడం అవసరం. ఉమ్మడి జాబితాలోని విద్యపై రాష్ట్రాల హక్కులను హరిస్తున్న, రాజ్యాంగ ఫెడరల్ సూత్రాలను కాలరాస్తున్న విద్యా కేంద్రీకరణ విధానానికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. పేపర్ లీకేజి సమస్య అనేది నేడు కొత్తగా తలెత్తినది కాదు. గతంలో కూడా మెడికల్, ఇంజినీరింగ్, వంటి కోర్సులకు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలలోనూ అక్రమాలు, అవకతవకలు, లీకేజీలు చోటుచేసుకున్నాయి. చదువులంటే మెడికల్, ఇంజినీరింగ్, కంప్యూటర్, బిజినెస్ మేనేజ్‌మెంట్, సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కోర్సులు అన్న భావన బలపడి పోయింది. జేఈఈ, నీట్ పరీక్షలలో మంచి ర్యాంకులు పొందడమే మహా యజ్ఞమైంది. మిగతావన్నీ కొరగానివిగా, అర్భకుల చదువులుగా భావించే అపోహ బలపడ్డాయి. ఇదే అదనుగా కోచింగ్ సెంటర్లు పుట్టుకు వచ్చాయి. కోటళల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వాలు విద్యను ఒక వ్యాపార సరుకుగా మార్చేశాయి. ప్రైవేట్ రంగం విజృంభించడానికి ఇలాంటి నీట్ పరీక్షల విధానాలు కూడా ఓ కారణంగా చూడాలి. దీనికితోడు సమాజంలో నిరుద్యోగం, ఉపాధి లేమి అంతకంతకూ పెరుగుతుండడంతో పిల్లల భవిష్యత్తు యెడల అంతులేని అభద్రతాభావం తల్లిదండ్రులను వెంటాడుతోంది. ఈ పరిస్థితులే కార్పొరేట్ విద్యకు, కోట్ల వ్యాపారానికి, కోచింగ్ సెంటర్ల మాఫియా ముఠాలకు కేంద్రాలుగా మారాయి. పిల్లల చదువులు, వారి భవిష్యత్తు పట్ల సమాజంలో ఎంతో ఆసక్తి, ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఒక బలమైన ప్రజా ఉద్యమం ద్వారానే మన దేశ విద్యా వ్యవస్థను మార్చడం సాధ్యమవుతుంది. కొత్తగా తీసుకుని వస్తున్న బిల్లు వల్ల మంచి ఫలితాలు వస్తాయని చెప్పడానికి లేదు. లీకులకు అలవాటు పడ్డవారు ఎలాంటి శిక్షలకైనా తెగిస్తారు. కోర్టుల్లో బెయిల్ పొందడం వంటి వెసలుబాట్లను ఉపయోగించుకుంటారు. అందువల్ల సమగ్ర విద్యావిధానంపై చర్చించి, విద్యారంగాన్ని బలోపేతం చేసే చర్యలకు నడుంబిగించాలి. కనీసం విపక్షాలయినా ఈ బిల్లు సందర్భంలో ప్రమాణాలపై చర్చివుంటే బాగుంటుంది.

# బిల్లుకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి..

అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. జాతీయ గేయం వందేమాతరంపై బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. బిల్లుపై సభలో చర్చ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేతలు భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఇటీవల దిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని... దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలో పాల్గొనాలని సభ్యులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పదే పదే కోరినప్పటికీ ఆందోళనలు విరమించలేదు. కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలె బిల్లుపై మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణించి, దోషులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో నిబంధనలు రూపొందించారు. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ చట్టం ద్వారా పోటీ పరీక్షల్లో పారదర్శకత పెరుగుతుందని, పేపర్ లీకేజీలు, నకిలీ పరీక్షలు, ఇతర అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఆయన పేర్కొన్నారు. నిజాయతీగా శ్రమించే విద్యార్థుల భవిష్యత్తును రక్షించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. 'పరీక్షల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. పేపర్ లీక్‌లు, మోసపూరిత కార్యకలాపాలు, పరీక్షల గోప్యతను భంగం చేసే వారిపై కఠిన శిక్షలు అమలు చేస్తాం. ఈ చట్టం అమల్లోకి రావడంతో పోటీ పరీక్షలపై విద్యార్థుల్లో విశ్వాసం మరింత పెరుగుతుంది. ప్రతిభ ఆధారంగా అవకాశాలు లభించే వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటూ పరీక్షా వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంది' అని అన్నారు.

# పేపర్ లీక్ నిరోధక బిల్లుపై వాడీవేడీ చర్చ

మొదటిపేజీ తరువాయి..

భాజపా ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై లోక్‌సభలో బుధవారం కూడా వాడీవేడి చర్చ కొనసాగించింది. ఈ చర్చలో భాగంగా రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. విద్యార్థుల ఆందోళన విషయంలో కేంద్రం తీరుపై విమర్శలు గుప్పించారు. యువత ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. వారి సెంటిమెంట్‌ను అన్ని పార్టీలు గౌరవించాయి. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న విద్యార్థులు పేపర్ లీక్ వంటి ఘటనలతో ఆందోళనకు గురయ్యారు. తీవ్ర వేదన తర్వాతే దిల్లీ వేదికగా నిరసనలు చేపట్టారు. శాంతియుత నిరసన చేస్తున్న వారిని రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారు. ఆందోళన చేసిన వారితో నేను మాట్లాడాను. వారు చెప్పిన మాటలు నన్ను కదిలించాయి. మూర్ఖులు ఎవరి మాటలు వినరని విద్యార్థులు నాతో చెప్పారు. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని బాధపడ్డారని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే, రాహుల్ ప్రసంగంపై భాజపా ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో అభ్యంతరకర మాటలు మాట్లాడుతున్నారని, విద్యార్థుల పేరు చెప్పి ఎంపీలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో కేంద్రం, విపక్ష నేత మధ్య ఒకింత వాగ్వాదం నెలకొంది. దీంతో స్పీకర్ దాన్ని తొలగించారు. చదువు అనేది ప్రస్తుతం ఖరీదైన వ్యాపారంగా మారింది. విద్యార్థుల కోసం నేడు తల్లిదండ్రులు లక్షలు ఖర్చుపెడుతు న్నారు. కానీ, విద్యావ్యవస్థ క్రూరంగా మారింది. ప్రైవేటీకరణ విచ్చలవిడిగా జరుగుతోంది. ఇక, ఈ వ్యవస్థ నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం సింబల్ మాత్రమే. విద్యార్థులకు అసలైన శత్రువు ఈ సంస్థే. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకే ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటోంది. ఆఖరికీ వర్సిటీల్లోనూ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లనే వీసీలుగా నియమించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను కూడా అధికార సభ్యులు తీవ్రంగా ఖండించారు. అనంతరం విద్యార్థులపై పోలీసుల చర్యను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఎందుకు ప్రయోగించారని ప్రశ్నించారు. ఆందోళనకారులను అణచివేయాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారని ఆరోపించారు. సభకు రావడానికి హోంమంత్రికి ధైర్యం లేదంటూ విమర్శించారు. దీంతో సభలో మరోసారి గందరగోళం నెలకొంది. రాహుల్ గాంధీ ఇలాంటి ఆరోపణలు ఎలా చేస్తున్నారు? అమిత్ షా పేరును ప్రస్తావించేందుకు ఆయన వద్ద ఏం ఆధారాలున్నాయి? రాహుల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. ఇ కపోతే పేపర్ లీక్‌పై ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలు, వారి పిల్లలను అడగాలంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదని.. భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేశారని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు గౌరవించాలని రాహుల్ పిలుపునిచ్చారు. తీవ్ర వేదన తర్వాతే విద్యార్థులు ఆందోళన చేశారని.. కానీ వారి నిరసనను కేంద్రం అర్థం చేసుకోలేదని విమర్శించారు. కేంద్రం మూర్ఖంగా వ్యవహరించిందన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను రెచ్చగొట్టేలా పోలీసులు



ప్రవర్తించారని మండిపడ్డారు. మూర్ఖులు ఎవరి మాటలు వినరని.. ప్రభుత్వంలో ఉన్నవారు తమ ఆవేదనను పట్టించుకోరని విద్యార్థులు చెప్పారన్నారు. వారి ఆవేదనను పట్టించుకోలేదనే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని వివరించారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, హింసించారని మండిపడ్డారు. పేపర్ లీక్ వార్తతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని.. వారి ఆవేదనను అర్థం చేసుకున్నందునే వారి పక్షాన మాట్లాడుతునట్లు రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగాన్ని బీజేపీ ఎంపీలు అడ్డుకున్నారు. ఇడియట్స్ అనే పదాన్ని రాహుల్ వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహించారు. రాహుల్ తన భాషను మార్చుకోవాలని కిరణ్ రిజిజు అన్నారు. విద్యార్థుల పేరుతో అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు.బీజేపీ ఎంపీల వ్యాఖ్యలపై రాహుల్ మాట్లాడుతూ.. 'నేను ఎంపీలను విమర్శించలేదు. బీజేపీ ఎంపీలు కావాలనే నా ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారు. సభలో కేవలం బీజేపీ ఎంపీలే మాట్లాడాలనడం సరికాదు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు.

## అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీసేవ

మొదటిపేజీ తరువాయి..

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీ-సేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ఈ-గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతిని సిఎస్ సమీక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీ-సేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక సేవలు మీ-సేవ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికలో చేర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు డేటా ఆధారిత పరిష్కారాలను మీ-సేవ వ్యవస్థతో అనుసంధానించి, ఈ-గవర్నెన్స్ సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనన్ని ఎక్కువ సేవలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమయానుకూలమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, మీ-సేవను దేశంలోనే ఆదర్శవంతమైన పౌర సేవల వేదికగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, మీ-సేవ డైరెక్టర్ రవికిరణ్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొలువుల జాతర

మొదటిపేజీ తరువాయి..

విద్యార్హతలు, పోస్టుల వారీ అర్హతలు, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ, పరీక్షల షెడ్యూల్ వంటి పూర్తి వివరాలను తెలంగాణ పోలీస్ నియామక మండలి అధికారిక వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు అధికారిక నోటిఫికేషన్‌ను పూర్తిగా చదివి తమ అర్హతలను నిర్ధారించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఈ భారీ నియామక ప్రక్రియతో పోలీస్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న వేలాది మంది యువతకు మంచి అవకాశం లభించనుంది. త్వరలో దరఖాస్తుల సమర్పణ తేదీలు, ఎంపిక విధానం, ఇతర కీలక షెడ్యూల్‌ను కూడా బోర్డు ప్రకటించనుంది. అందువల్ల ఆసక్తి ఉన్న అభ్యర్థులు అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని, అధికారిక ప్రకటనలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫైర్, విపత్తు స్పందన, అత్యవసర ఽ సివిల్ డిఫెన్స్ శాఖలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ ఫైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్లు ఽ సవరణ సేవల శాఖలో డిప్యూటీ జైలర్ (పురుషులు) 14, డిప్యూటీ జైలర్ (మహిళలు) 1, వార్డర్ (పురుషులు) 196, వార్డర్ (మహిళలు) 12 పోస్టులు అందుబాటులో ఉన్నాయి. , ఫైర్, జైళ్ల శాఖలకు




సంబంధించిన పోస్టులు వరుసగా +ూ 84, 80, 83 (తేదీ 03-07-2026) ప్రకారం భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బోర్డు స్పష్టం చేసింది. అయితే దరఖాస్తుల ప్రారంభ, ముగింపు తేదీలను త్వరలో మరో ప్రత్యేక ప్రెస్ రిలీజ్ ద్వారా ప్రకటించనున్నట్లు తెలిపింది. దరఖాస్తు చేసుకునే ముందు అభ్యర్థులు తమకు అవసరమైన శారీరక ప్రమాణాలు, వైద్య అర్హతలు ఉన్నాయో లేదో సివిల్ సర్జన్ ద్వారా పరీక్షించుకోవాలని సూచించింది. దరఖాస్తు సమయంలో అవసరమైన పత్రాలను కూడా ముందుగానే సిద్ధం చేసుకోవాలని బోర్డు సూచించింది. రాజ అభ్యర్థులు తాజా ఉపవర్గీకరణ (గ్రూప్-1,2,3)తో కూడిన కమ్యూనిటీ సర్టిఫికేట్ సమర్పించాలి. ఈ డబ్ల్యుఎస్ అభ్యర్థులు 2026 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత జారీ చేసిన సర్టిఫికేట్ సమర్పించాలి. బీసి అభ్యర్థులు కూడా 2026 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత పొందిన నాన్-క్రీమీ లేయర్ సర్టిఫికేట్ సిద్ధంగా ఉంచుకోవాలి. అదేవిధంగా 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు చదివిన బోనాఫైడ్ సర్టిఫికెట్లు లేదా సంబంధిత నివాస ధ్రువీకరణ పత్రాలు స్థానికత నిర్ధారణ కోసం అవసరం అవుతాయి. ప్రత్యేక రిజర్వేషన్ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

## సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

మొదటిపేజీ తరువాయి..

చేసేందుకు యాక్షన్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా హక్కు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏలను నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ పక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ఃూఎఖీ పక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ పక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## పోలీసులు చట్టప్రకారమే వ్యవహరించారు

మొదటిపేజీ తరువాయి..

స్పందిస్తూ.. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు తాను కూడా చాలాసార్లు అరెస్టయినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ విధించినప్పుడు పోలీసులు తనను తరగతి గదిలోనే అరెస్ట్ చేశారని వెల్లడించారు. సామాజిక కార్యక్రమాలలో పాల్గొనే ఏ విద్యార్థి అయినా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. శాంతిభద్రతలను కాపాడటానికి, ఆందోళనకారులను అదుపు చేయడానికి పోలీసులు చట్ట ప్రకారమే వ్యవహరించారని నడ్డా పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. సీజేపీకి మద్దతుగా ఆందోళనల్లో పాల్గొన్నందుకు పోలీసులు బుధవారం సీపీఎం ఆఫీస్‌పై దాడి చేశారని ఆ పార్టీ ఎంపీలు చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి ఖండించారు. దీంతో రాజ్యసభలో కొంతసేపు గందరగోళం నెలకొంది.

## తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి..

కంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యంకాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.



## ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమే

మొదటిపేజీ తరువాయి..



ప్రయాణంపై నిందితుడు చేసిన పోస్టుకు ఆమె స్పందించడంతో వీరి పరిచయం ప్రారంభమైంది. తాను కూడా 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యానని.. ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్‌లో ఉండటంతో 2025 బ్యాచ్‌తో కలిసి శిక్షణలో చేరనున్నట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం ఇద్దరూ స్నేహితులయ్యారు. ఈ పరిచయం ప్రేమగా మారింది. ఎన్‌పీఏలో శిక్షణ పొందుతున్న సమయంలో వీరి సంబంధం మరింత బలపడింది. కొంతకాలం తర్వాత ఇద్దరి మధ్యా మనస్పర్థలు వచ్చాయి. నిందితుడు పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. బాధితురాలి ల్యాప్‌టాప్‌ను విసిరి ధ్వంసం చేశాడు. ఆమె తనను బ్లాక్ చేసిన తర్వాత నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించాడు. వ్యక్తిగత చాట్‌లను బహిర్గతం చేస్తానని బెదిరించాడు. బాధితురాలి అనుమతి లేకుండా కుటుంబ సభ్యులు, సహచరులను సంప్రదించాడు. వేధింపులు పెరగడంతో బాధితురాలు అతడి నుంచి దూరంగా ఉంది. అనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. అయినా ఉదయ్ కృష్ణారెడ్డి వేధింపులు ఆగలేదు. కేసు దర్యాప్తులో ఉదయ్ కృష్ణారెడ్డి నేరానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నిందితుడిని అరెస్ట్ చేసి ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచాం. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది. చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం. మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం కేసును దర్యాప్తు చేస్తోందని సజ్జనర్ పేర్కొన్నారు.

తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్‌కృష్ణారెడ్డిని పోలీసులు మిర్యాలగూడలో మంగళవారం అదుపులోకి తీసుకుని ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించారు. ఉదయ్ కృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఉదయ్‌కృష్ణారెడ్డిని బుధవారం ఉప్పర్ పల్లి కోర్టులో హాజరపరుచగా.. న్యాయమూర్తి అతడికి ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు భారీ భద్రత మధ్య చంచల్ గూడ జైలుకు తరలించారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై ఉదయ్‌కృష్ణారెడ్డి దాడి చేసినట్టు వైద్యపరీక్షల్లో నిర్ధారణ అయినట్టు తెలిసింది. కేసు నమోదైన జూలై 18న బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆమెపై భౌతికంగా దాడి జరిగినట్టు తేల్చారు. బాధితురాలి గొంతు నులిమినట్టు గాయాల ఆనవాళ్లు, చెంప భాగంలో కొట్టిన కమిలిన గాయా లు, ఎడమ కాలిపైనా గాయం ఉన్నట్టు సమాచారం.

## జన్నారం ఎస్బిఐ శాఖలో ఫీల్డ్ అధికారి లేక రైతుల గోస

**పంట సమయంలో రుణాలు ఆగి రైతుల అవస్థలు**




**జన్నారం, జూలై 29 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ లో గత నెల రోజులుగా ఫీల్డ్ అధికారి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే వరి, పత్తి,ఇతరత్రా పంటలు వేసే సమయం కావడంతో రైతులకు పంట రుణాలు ఎంతో అవసరం అటువంటి సమయంలో ఫీల్డ్ అధికారి లేకపోవడంతో దరఖాస్తులు పెండింగ్ లో ఉండి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పని కాకపోవడంతో విత్తనాలు ఎరువులు కొనడానికి డబ్బులు లేక అప్పులు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నత అధికారులు స్పందించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జన్నారం శాఖకి తక్షణమే ఫీల్డ్ అధికారి ని నియమించాలని రైతులు, ఖాతాదారులు కోరుతున్నారు. లోన్ కట్టి 25 రోజులు అవుతుంది. ముత్యం సతీష్(రైతు) పంట లోన్ కట్టి దాదాపు 25 రోజులు అవుతుందని,ఫీల్డ్ అధికారి లేక లోన్ రెన్యూవల్ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని జన్నారం మండలంలోని టీజీ పల్లె గ్రామానికి చెందిన ముత్యం సతీష్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పంట సమయంలో విత్తనాలు కొనే సమయంలో డబ్బులు చేతికి రాక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.కావున ఎస్బిఐ శాఖ జన్నారం లో వెంటనే ఫీల్డ్ అధికారి ని నియమించాలని కోరారు.

## ఇంటిభోజన రుచిని అందించడమే లక్ష్యం




**మంచిర్యాలరూరల్ జులై 29 (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన శుభం రెడ్డీస్ కిచెన్ అండ్ క్యాంటీన్ హోటల్‌ను మున్సిపల్ కార్పొరేషన్ అధ్య క్షులు, 14వ డివిజన్ కార్పొరేటర్ తూముల నరేష్, కార్డియాలజిస్ట్ ప్రముఖ వైద్యుడు డాక్టర్ వికాస్,14 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొల్లూరి సుధీర్ తో కలిసి ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి హోటల్‌ను ప్రారంభించిన అనంతరం యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా తూముల నరేష్ మాట్లాడుతూ మంచిర్యాల ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని సరసమైన ధరల్లో అందించాలనే సంకల్పంతో ఈహోటల్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. డాక్టర్ వికాస్ మాట్లాడుతూ ఇంటి భోజ నాన్ని తలపించే రుచితో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. నాణ్యతను కొనసాగిస్తూ ప్రజల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హోటల్ యాజమాన్యం, స్థానిక ప్రముఖులు,స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## పంచాంగ కర్తలే హిందూ సమాజ మార్గదర్శకులు

**- భాజపా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్**



**మంచిర్యాల, 29, జులై (ప్రజాజ్యోతి) :** గురు పౌర్ణమి సందర్భంగా చెన్నూరు పట్టణంలో ప్రముఖ పంచాంగ కర్త, జ్యోతిష్య పండితులు కోమ్మర దత్తాత్రేయ శర్మను భారతీయ జనతా పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భాజపా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ మాట్లాడుతూ, పంచాంగ కర్తలు హిందూ సమాజానికి మార్గదర్శకులని అన్నారు. పంచాంగం అనేది కేవలం తిథులు, నక్షత్రాలు తెలిపే గ్రంథం మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, ఖగోళ విజ్ఞానం, ధార్మిక సంప్రదాయాలకు అద్దం పట్టే మహాగ్రంథమని పేర్కొన్నారు. పంచాంగం ద్వారా పండుగలు, వ్రతాలు, శుభముహూర్తాలు, ధార్మిక ఆచారాలు నిర్ధారించబడతాయని, సమాజానికి దిశానిర్దేశం చేసే గొప్ప సంప్రదాయం పంచాంగ రచన అని అన్నారు. ప్రఖ్యాత పంచాంగ రచయితలలో ఒకరైన కోమ్మర దత్తాత్రేయ శర్మ చెన్నూరు వాస్తవ్యులు కావడం జిల్లా ప్రజలకు గర్వకారణ మని తెలిపారు. గురు పౌర్ణమి రోజున జ్ఞానాన్ని పంచే గురువులను ఎంతగా గౌరవిస్తామో, జ్ఞాన సంప్రదాయాన్ని పరిరక్షిస్తూ పంచాంగాలను రూపొందిస్తున్న పంచాంగ కర్త లను కూడా అంతే గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. వారి నిరంతర కృషి వల్లే భారతీయ సంస్కృతి, సంప్రదా యాలు, సనాతన ధర్మం తరతరాలకు సజీవంగా కొనసాగు తున్నాయని కొనియాడారు. అనంతరం కోమ్మర దత్తాత్రేయ శర్మను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. గురు పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని ఆయన అందిస్తున్న సేవలను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాజపా ధార్మిక సెల్ జిల్లా కో-కన్వీనర్ పొన్నం లక్ష్మా గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఏతం శివకృష్ణ, కౌన్సిలర్ గర్రెపెల్లి శాంత వెంకట నరసయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి కాయిత వెంకటేష్, భాజపా లీగల్ సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ మద్ది కార్తీక్, భాజపా నాయకులు ప్రసాద్, తుమ్మ చిరంజీవి, అడప శ్రీనివాస్, చకేటి శ్యామ్, చటారి వెంకటేష్, గణేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎస్సై ఉదయ్ కిరణ్**



**జూలై 29 (ప్రజాజ్యోతి) :** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ సూచించారు. అవసరం లేకుండా వాగులు,వంకలు, నదులు దాటేందుకు ప్రయత్నం చేయవద్దని, గోదావరి నది పరిసర ప్రాంతాలకు ప్రజలు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు ఎవరు వెళ్లకూడదని, వర్షాలు, గాలులు వీస్తున్న సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడవద్దని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, రాత్రి వేళల్లో అనవసరంగా బయటకు వెళ్ళవద్దని, పిల్లలను వరద నీటి వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపారు.

# వ్యాస మహర్షి తపో భూమి బాసర జ్ఞాన సరస్వతి క్షేత్ర మహిమ




**బాసర జూలై 29 (ప్రజా జ్యోతి) :** నిజానికి వ్యాసుడు అనేది ఒక పదవి పేరు. ప్రతీ ద్వాపరయుగం లోనూ ఒక వ్యాసుడు ఉద్భవిస్తాడు. సాక్షాత్తు ఆ శ్రీమన్నారయణుడే వ్యాసుడుగా అవతరిస్తాడు. ఈ అనంతంగా తిరిగే కాలచక్రంలో ధర్మం కృతయుగంలో 4 పాదాలతో, త్రేతాయుగంలో 3 పాదాలతో, ద్వాపరయుగంలో2 పాదాలతో, ఈ కలియుగంలో 1 వ పాదంతో, నడుస్తుంది. ఆదిగురువు వేదవ్యాసులవారు. వ్యాసులవారు పుట్టినరోజునే గురుపూర్ణిమ, వ్యాసపూర్ణిమ, అంటారు. నారాయణమూర్తి స్వరూపమే వేదవ్యాసులవారు. అందుకే ఆయన్ని అపర నారాయణుడని పిలుస్తారు. వేదవిభజన చేసిన మహానుభావుడాయన. ఆయనవల్లనే మనకు అష్టాదశ పురాణాలు ఏర్పడ్డాయి. భారత భాగవతాలనందించినవారే వ్యాసులవారు. వ్యాసమహర్షి ఒక వ్యక్తి పేరు మాత్రమే కాదు. ప్రతి ద్వాపర యుగములోను ఒక సారి వ్యాసుడు ఉద్భవిస్తాడు. ఆయన జన్మించిన తిథి అయిన ఆషాఢ శుద్ధ పూర్ణిమను గురు పూర్ణిమ గా జరుపుకుంటాం. లోకానికంతటికీ జ్ఞానాన్ని అందించిన గురువు వ్యాసుడు కాబట్టి వ్యాసుని జన్మ తిథిని గురు పూర్ణిమగా జరుపుకోవడం ఆచారమైంది. ఇతడు పరాశర మహర్షికి, మత్స్య గంధికి (సత్యవతి) కి కృష్ణ వర్ణం (నల్లని రంగు)తో ఒక ద్వీపంలో జన్మించారు కనుక కృష్ణద్వైపాయనుడు అని పిలవబడ్డాడు. పుట్టీ పుట్టగానే చేతిలో కమండలం, దండము చేతబట్టి తపస్సు చేసుకోవటానికి వెళ్తానని తల్లి మత్స్యగంధి అనుమతితో తపస్సుకు వెళ్ళిన తపోధనుడు కృష్ణద్వైపాయనుడు. వ్యాస మహర్షి నాలుగు వేదాలను విభజించి లోకానికి అందించాడని పురాణాలు చెబుతున్నాయి. పూర్వం సోమకాసురుడు వేదాలను సముద్రంలో దాచేస్తే.. శ్రీ మహా విష్ణువు మత్స్యావతారంలో ఆ వేదాలను తీసుకొచ్చాడు. అలా వచ్చిన వేదాలు ఒకదానితో ఒకటి కలిసి కలగాపులగం అయిపోగా.. వాటిని వ్యాస మహర్షి విడదీసి విభజించి నాలుగు వేదాలుగా లోకానికి అందించాడు.

వేదరాశిని నిత్య కర్మలలో క్రతువుల్లో వాడే ఉపయోగాలను బట్టి ఋక్-యజుర్-సామ-అధర్వణ వేదాలుగా విభజించి వేదవ్యాసుడైనాడు. ఆతర్వాత బ్రహ్మదేవుని ఆజ్ఞతో విఘ్నేశ్వరుడు రాయగా ... వేదసారాన్నంతా చేర్చి పంచమవేదంగా ప్రసిద్ధికెక్కిన భారత ఇతిహాసాన్ని గ్రంథస్తం చేసాడు. అంతేకాక భాగవతాన్ని , అష్టాదశ పురాణాలను మనకు ప్రసాదించాడు. సాక్షాతు శ్రీ మహా విష్ణువు అవతారంగా భావించే వ్యాస భగవానుని గానూ ఆదిగురువుగానూ భావిస్తారు.

**విష్ణు సహస్రనామములో కూడా..** "వ్యాసాయ విష్ణు రూపాయ -- వ్యాస రూపాయ విష్ణవే, నమోవై బ్రహ్మ నిధయే వాశిష్టాయ నమోనమ: !!

అని వ్యాసునికి విష్ణువుకు అభేదం చెప్ప బడింది, వేదవ్యాసుడు అనంతంగా ఉన్న వేదాలని విభజించి పైలుడను శిష్యునకు ఋక్సంహితను, వైశంపాయనునకు యజుస్సంహితను, జైమినికి సామసంహితను, సుమంతునకు అధర్వణ సంహితను భోధించి వానిని లోకములో వ్యాప్తి చేయండని ఆదేశించాడు. వ్యాసుడు వేదాలని విభజించటమే కాకుండా అష్టా దశ పురాణాల్ని, ఉప పురాణాలను రచించాడు. బ్రహ్మసూత్రాల్ని వివరించాడు, భారత, భాగవతాలని రచించాడు. తాను గ్రంథస్థం చేసిన పురాణేతిహాసములను సూతునకు తెలియజేసి ప్రచారం చేయమని చెప్పాడు. వ్యాస భగవానుని అనుగ్రహం వలన జ్ఞానం విస్తరించి విశ్వవ్యాప్తం అయ్యింది. సూత మహాముని ప్రధాన ప్రచారకుడై విషయములు బహుళ ప్రచారం చేసాడు.

వ్యాసం వశిష్ఠనప్తారం శక్తే , పౌత్రమకల్మషమ్ ।
పరాశరాత్మజమ్ వందే శుక తాతం తపోనిధిమ్

తాత్పర్యం:- వశిష్టుని మునిమనుమడైన కల్మష రహితుడైన శక్తికి మనుమడైన పరాశరుని కుమారుడైన , శుకమహర్షి తండ్రి అయిన ఓ వ్యాస మహర్షి నీకు వందనము.

ఇంతటి మహోన్నతమైనటువంటి మహానుభావుడైన సాక్షాత్తు

మహా విష్ణు స్వరూపమైనటువంటి వేదవ్యాస మహర్షుల వారు మహాభారత యుద్ధానంతరము దండకారణ్య ప్రదేశంలో అనగా ప్రస్తుతమన తెలంగాణ రాష్ట్రంలో పూర్వ ఆదిలాబాద్ జిల్లా ఇపుడు నిర్మల్ జిల్లాగా పిలవబడుతున్న ఈ ప్రదేశంలో గోదావరి నది తీరంలో సాక్షాత్తు సరస్వతి అమ్మవారి కోసం కొన్ని సంవత్సరములు విశేషమైనటువంటి తపస్సును ఆచరించి అమ్మవారి సాక్షాత్కారం పొంది ఈ గోదావరి నది నుండే సైకతమును అనగా ఇసుకను తీసుకుని మహాకాళి మహాలక్ష్మి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవార్లుగా సైకతమూర్తులను ప్రతిష్టించి సూర్యచంద్రాదులు ఉన్నంతకాలం జ్ఞానార్థులై జ్ఞాన బిక్ష కోసం వారి వారి కోరికల సిద్ధి కోసం ఈ వ్యాసపుర క్షేత్రానికి వచ్చేటువంటి భక్తులందరికీ జ్ఞానము మేధస్సు విద్యను ప్రసాదించవల సిందిగా మనందరికోసం అమ్మవారి దగ్గర వరాన్ని పొంది మనందరికీ కూడా అమ్మవారి కటాక్షం లభించేలా అనుగ్రహించినటువంటి ఋషి పుంగవుడు భగవత్ స్వరూపుడు అయిన వేద వ్యాసుల వారి యొక్క జన్మదినోత్సవాన్ని ప్రపంచమంతా కూడా గురు పౌర్ణమి గా జరుపుకుంటారు అటువంటి మహత్తరమైనటువంటి రోజును మనము సాక్షాత్తు ఆ మహానుభావుడు నడయాడినటువంటి ఈ బాసర క్షేత్రంలో జరుపుకోవడం ఎన్నో జన్మల పుణ్యఫలం కావున భక్తులంతా కూడా ఇట్టి వ్యాసపౌర్ణమి మహోత్సవాలలో అధిక సంఖ్యలో పాల్గొని సాక్షాత్తు వేదవ్యాస మహర్షుల వారి మరియు జ్ఞాన సరస్వతి అమ్మవారి అనుగ్రహం పొందగలరని కోరుచున్నాము.

# ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ ప్రతీ ఫిర్యాదుపై తక్షణ స్పందన

**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**




**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 29, (ప్రజాజ్యోతి) :**
నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఈరోజు భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.

ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**కుటుంబ వివాదాల పరిష్కారంలో 'షీ టీం' పాత్ర :**
ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడంపై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష :**
ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## బాసర అమ్మవారి క్షేత్రంలో వైభవంగా వ్యాస పూర్ణిమ వేడుకలు





**వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే**

**బాసర జూలై 29 (ప్రజాజ్యోతి) :** బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో వ్యాస పూర్ణిమ వేడుకలు వైభవ పేతంగా జరిగాయి. బుధవారం వ్యాస పూర్ణిమను పురస్కరించుకొని ఎమ్మెల్యే పవా ర్ రామరావు పటేల్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాల చారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బాల ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వ్యాసలయంలో పూజలు చేసి, వేద పండితులు చేపట్టిన యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యేతో పెద్ద మొత్తంలో సర్పంచులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొంగిపొర్లుతున్న వాగులు వంకలు





**ప్రధాన రహదారిపై నెలకొరిగిన వృక్షాలు-తొలగించిన ఎస్.ఐ**

**జన్నారం, జూలై 29 (ప్రజాజ్యోతి) :** గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జన్నారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఉన్న వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని లోతొర్రె వాగు ఉధృతం గా ప్రవహిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మండలంలోని రోటిగూడ గ్రామంలోని బండొర్రె బ్రిడ్జ్ పై నుండి వరద నీరు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరదనీటి ప్రవాహం ప్రమాదకార స్థాయిలో ఉండడంతో గ్రామస్తులు వాహనదారులు బ్రిడ్జిని దాటేందుకు భయభ్రాంతులకు గురవుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న ఎస్.ఐ ఉదయ్ కిరణ్ అక్కడికి వెళ్లి వరద ఉధృతి ని పరిశీలించి వంతెనపై నుండి ఎవరు వెళ్లకుండా అక్కడ సిబ్బందిని ఉంచారు.అంతకుముందు ఉదయం బొమ్మేన ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరగడంతో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై గుర్రం ఉదయ్ కిరణ్ భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వెంటనే సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి జేసిబి సహాయంతో ప్రధాన రహదారిపై పడ్డ భారీ వృక్షాన్ని తొలగించి వాహన రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రధాన రహదారిపై పడ్డ చెట్టును తొలగించడంతో మండల వాసులు, వాహనదారులు ఎస్.ఐ ఉదయ్ కిరణ్, సిబ్బందిని అభినందించారు.

## శ్రీ జ్ఞాన సరస్వతి దేవిపై రచించిన పాటలను విడుదల చేసిన ఆలయ అధికారులు



**బాసర, జూలై 29 (ప్రజా జ్యోతి) :** బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారిపై రచించిన భక్తి గీతాల సీడీని బుధవారం ఆలయ సన్నిధిలో ఘనంగా ఆవిష్కరించారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో విజయ రామారావు, ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ఆలయ అర్చకులు సంయుక్తంగా సీడీని విడుదల చేశారు. హైదరాబాద్‌కు చెందిన మామిడాల సాహితి ప్రస్తుతం జనగాంలో మెడిసిన్ మొదటి సంవత్సరం చదువుతోంది. చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి దేవిపై ఉన్న భక్తితో ఆరు భక్తి గీతాలను రచించి, వాటిని సీడీ రూపంలో అమ్మవారి సన్నిధిలో విడుదల చేయడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు మామిడాల సాహితికి అమ్మవారి ప్రసాదం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మురళి, శృతి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## బాసరలో గోశాలల నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులు




**బాసర జూలై 29 (ప్రజా జ్యోతి) :** బాసర జ్ఞానసరస్వతి అమ్మ వారి క్షేత్రంలో, వేద పాఠశాలలో కృష్ణ మందిరం గోశాలల నిర్మాణానికి ఎమ్మెల్యే రామరావ్ పటేల్ భూమి పూజ చేశారు.. బుధవారం వ్యాస పూర్ణిమ సందర్భంగా బాసర సరస్వతి అమ్మ వారి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి గ్రామం లో గోశాలల నిర్మాణం చేపడతామన్నారు.. అనంతరం సరస్వతి శిశు మందిర్ పాఠ శాల భవన నిర్మాణ పనులు ప్రారంభించి మొక్కలను నాటారు. కార్యక్రమం లో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలపై అప్రమత్తమైన పోలీసులు..

**- వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన**
**- మంచిర్యాల రాళ్లవాగును సందర్శించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**మంచిర్యాల, 29, జులై (ప్రజాజ్యోతి) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ అప్రమత్తమైంది. మంచిర్యాల జోన్ పరిధిలోని పాత మంచిర్యాల ప్రాంతంలోని రాళ్లవాగును పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భారీ వర్షాలకు రాళ్లవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో పాత మంచిర్యాల ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని, మరికొన్ని ప్రాంతాల్లో రాకపోకలను పూర్తిగా నిలిపివేశామని చెప్పారు. పోలీసులు సూచించిన ట్రాఫిక్ మళ్లింపులను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, వర్షాకాలంలో భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వాతావరణ శాఖ మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు . ముఖ్యంగా కోటపల్లి, నీల్వాయి ప్రాంతాల వైపు ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున, అవసరమైతే ఎస్‌డీఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలను మోహరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో శిక్షణ పొందిన సుమారు 30 మంది సిబ్బంది అత్యవసర సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు .గత ఏడాది వరదల సమయంలో నీటిలో చిక్కుకున్న గ్రామాల ప్రజలను బోట్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించి విజయవంతంగా సహాయక చర్యలు చేపట్టిన విషయాన్ని కమిషనర్ గుర్తు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించేందుకు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ పరిశీలనలో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్, మంచిర్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# జూరాల నీటితో రైతులను ఆదుకోండి

- ఎల్‌నినో కాదు... ఎల్లో కాంగ్రెస్ వల్లే కరువు
- రైతులను భయపెట్టకుండా సాగునీరు అందించాలి
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి ప్రతినిధి, జూలై 29 (ప్రజాజ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో కరువు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్లే రైతులు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని వెంటనే విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవికుమార్ నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాలు పడవని, రైతులు పంటలు వేయొద్దని ప్రభుత్వం ప్రచారం చేయడం విచారకరమన్నారు. కాళేశ్వరం ద్వారా నీళ్లు ఇవ్వకుండా కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో నీటి కొరత ఉందనే భ్రమను సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ పశ్చిమ కనుమల్లో కురిసే వర్షాలతో కృష్ణా, తుంగభద్ర, భీమా నదుల్లోకి తగినంత నీరు వస్తుందని తెలిపారు. తుంగభద్ర నుంచి శ్రీశైలానికి సుమారు 400 టీఎంసీల



నీరు చేరుతుందని, అందువల్ల సాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. ఎల్లూరు కాలువ పరిధిలోని 19 నియోజకవర్గాలకు కేవలం 9 టీఎంసీల నీరే అవసరమని, వచ్చే జూన్ వరకు మిషన్ భగీరథ తాగునీటికీ ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. ఆలమట్టి, నారాయణపుర ప్రాజెక్టుల్లో గణనీయమైన నీటి నిల్వలు ఉన్నాయని, కర్ణాటకలో లక్షల ఎకరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉందన్నారు. జూరాలకు భారీ వర్షాలు లేకపోయినా తుంగభద్ర నుంచి వరద ప్రవాహాలు వస్తాయని, జూరాల కాలువలకు ఈ సీజన్‌లో తప్పనిసరిగా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా రూపొందించామని, పనులు దాదాపు 90 శాతం పూర్తయినా రెండున్నరేళ్లుగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. రైతులు నీళ్లు అడిగే వరకు వేచి చూడకుండా ముందుగానే సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నీటి సమస్యపై అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించేవారని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వరద వచ్చిన మూడు రోజుల తర్వాతే పంపులు ప్రారంభించారని, ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో నడిపి రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులు సాగునీటి కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ ఆందోళన ప్రకటించగానే అధికారులు తొందరపడి కాలువలకు నీరు విడుదల చేశారని విమర్శించారు. రైతులకు సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలని, లేకపోతే రైతాంగం సహించదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాయత్రి రవికుమార్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గుడిసెల్లేని వనపర్తే లక్ష్యం!

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- వారం రోజుల్లో గుడిసెల పూర్తి జాబితా సిద్ధం చేయాలి
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, జూలై 29 (ప్రజాజ్యోతి): వనపర్తి నియోజకవర్గాన్ని పూర్తిగా గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పక్కా ఇళ్లు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో





ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మొదటి విడతలో ఇళ్లు మంజూరైనా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులను వెంటనే గుర్తించి, వారి స్థానంలో నిజంగా అవసరమైన అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన 287 గుడిసెలతో పాటు నియోజకవర్గంలోని అన్ని గుడిసెలను పూర్తిస్థాయిలో గుర్తించి జాబితా సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధించిన పెండింగ్ అంశాలన్నింటినీ వారం రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు. అలాగే, లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇంటి నిర్మాణాలు చేపట్టేలా అధికారులు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడానికి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, లబ్ధిదారులకు అన్ని విధాలా సహకరించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ విటోబా, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏదుల తహసీల్దార్ కార్యాలయానికి కొత్త భవనం

- రూ.2.25 కోట్లు మంజూరు.. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హర్షం

వనపర్తి ప్రతినిధి, జూలై 29 (ప్రజాజ్యోతి): వనపర్తి నియోజకవర్గంలోని ఏదుల మండలానికి తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. అద్దె భవనం/శిథిలావస్థలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి మంజూరు చేసింది.



ఈ మేరకు G.O.Rt.No.428 ప్రకారం రూ.2.25 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఏదుల మండల ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణంతో ప్రజలకు ఒకేచోట మెరుగైన ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ అభివృద్ధి పనులకు సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల అభివృద్ధికి అవసరమైన మరిన్ని మౌలిక వసతుల కల్పనకు కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

## 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, జూలై 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్, వివిధ విభాగాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఆసుపత్రి ఆవరణలో ప్రస్తుతం కొనసాగుతున్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కార్యాలయాన్ని



అనువైన ప్రత్యామ్నాయ భవనానికి తరలించే అంశంపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పరస్పర సమన్వయంతో షిఫ్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యులు, విద్యార్థులు, రోగుల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు, గార్డెనింగ్, ప్రధాన రహదారి నుంచి ఆసుపత్రికి అప్రోచ్ రోడ్డు నిర్మాణం తదితర పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మరో రెండు నెలల్లో ఆసుపత్రి ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా, తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల సంస్థ డీఈఈ వేణుగోపాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## భీమా జలాలు పరుగులు!

- 92 వేల ఎకరాలకు సాగునీటి వరం
- ఎల్‌నినోలోనూ రైతుకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం
- భీమా నీటితో రైతుకు ఊరట..రైతు పొలాలకు నీటి బాట
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి





వనపర్తి ప్రతినిధి, జూలై 29 (ప్రజాజ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోయినా రైతులకు ఇబ్బందులు కలగకుండా భీమా స్టేజి–2 నుంచి దిగువ ప్రాంతాలకు బుధవారం సాగునీటిని విడుదల చేశారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి కలిసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ భీమా స్టేజి–2 ద్వారా సుమారు 92 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. రైతుల పొలాలు పచ్చగా ఉండాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అవసరమైన మేరకు నీటి సరఫరా కొనసాగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సాగునీరు, పెట్టుబడి సాయం, రుణమాఫీ, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. భీమా స్టేజి–2 ద్వారా విడుదలవుతున్న నీరు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ఫలితమేనని అన్నారు. దూరదృష్టితో నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేటికీ లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతోందని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త సాగునీటి ప్రాజెక్టు కూడా నిర్మించలేదని విమర్శించారు. కాంగ్రెస్ నిర్మించిన ప్రాజెక్టుల ద్వారానే నీళ్లు విడుదలవుతుండగా వాటి ఘనతను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేయడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. రైతుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ రాజీ పడదని, ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జూరాల కాలువలకు నీరు విడుదల చేయకుంటే రైతులతో కలిసి పోరుబాట : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్


మహబూబ్‌నగర్, జూలై 29( ప్రజా జ్యోతి బ్యూరో ): జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తున్నప్పటికీ కుడి, ఎడమ ప్రధాన కాలువలకు సాగునీటిని విడుదల చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు రైతుల ప్రయోజనాలను విస్మరిస్తోందని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు.



బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో 7.12 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, సుమారు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నప్పటికీ ఆ నీటిని కాలువలకు విడుదల చేయకుండా విద్యుత్ ఉత్పత్తి పేరుతో దిగువకు వదులుతున్నారని విమర్శించారు. దీంతో పాలమూరు రైతులు సాగునీటికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు రైతుల అవసరాలను పక్కనబెట్టి శ్రీశైలం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తోందని, తద్వారా ఆ నీరు పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే పరిస్థితిని సృష్టించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, జూరాల కుడి, ఎడమ ప్రధాన కాలువలకు వెంటనే నీటిని విడుదల చేసి పాలమూరు రైతుల సాగు అవసరాలను తీర్చాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాలువలకు నీటిని విడుదల చేయకపోతే, రేపు వేలాది మంది రైతులతో కలిసి జూరాల ప్రాజెక్టును ముట్టడించి, కాలువలకు నీటిని విడుదల చేసే ఉద్యమాన్ని ప్రారంభిస్తామని ఆయన హెచ్చరించారు.

## జూరాల కుడి కాలువకు సాగునీరు విడుదల

గద్వాల,జూలై 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ మండల పరిధిలో ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి కాలువకు బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా కృష్ణా నదికి ప్రత్యేక పూజలు చేశారు.కాలువలోకి నీరు విడుదల కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముందుగా ప్రజలకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.సాగునీటి విడుదలకు సహకరించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి,జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు,ప్రభుత్వ సలహాదారు వాకిటి శ్రీహరి,సహచర ఎమ్మెల్యేలకు గద్వాల నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఏడాది తగినంత వర్షపాతం లేకపోవడంతో నీటి లభ్యతపై ఇబ్బందులు ఉన్నప్పటికీ,రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సాగునీటిని విడుదల చేసిందన్నారు.ఉమ్మడి పాలమూరు ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి రైతుల సమస్యలను బాగా అర్థం చేసుకుని పంటల సాగుకు అవసరమైన సమయంలో నీటిని అందిస్తున్నారని పేర్కొన్నారు.రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించి రెండు పంటలకు సరిపడేలా ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలని సూచించారు.నారాయణపూర్ ప్రాజెక్టు



నుంచి నీటిని విడుదల చేసి జూరాల ప్రాజెక్టుకు అందిస్తున్నట్లు తెలిపారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధిక నీరు అవసరమయ్యే పంటల కంటే తక్కువ నీటితో సాగయ్యే పంటలను సాగు చేయాలని,వ్యవసాయ శాస్త్రవేత్తలు,వ్యవసాయ శాఖ అధికారులు సూచించే పంటలనే ఎంచుకోవాలని రైతులకు సూచించారు.కూరగాయలు,పండ్లు, ఆకుకూరలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని,రైతులు వ్యవసాయ అధికారులకు సహకరించాలని కోరారు.ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని,ఎలాంటి అపోహలకు గురికాకుండా ధైర్యంగా సాగు పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు.నడిగడ్డ ప్రాంతంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జూరాలకు వస్తున్న వరద నీటిని వినియోగించుకునేందుకు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా ర్యాలంపాడు,గూడెందొడ్డి పంపు మోటార్లను ఇప్పటికే ప్రారంభించామని,రిజర్వాయర్ల ద్వారా కాలువలకు సాగునీటిని విడుదల చేస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,జిల్లా నాయకులు,అధికారులు,రైతులు,కార్యకర్తలు,యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

ఎన్యూమరేషన్ ఫారాలు వెంటనే సమర్పించాలి

గద్వాల,జూలై 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఓటరు ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని,ఇప్పటివరకు జిల్లాలో సుమారు 89 శాతం పూర్తైందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు.మిగిలిన11శాతం ప్రక్రియను కూడా బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వోలు),రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) సమన్వయంతో పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ పూర్తయిన అనంతరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లలో కొందరి పేర్లు రెండు ప్రాంతాల ఓటరు జాబితాల్లో ఉండే అవకాశం ఉందని,వారు తమ ఓటు ఏ ప్రాంతంలో కొనసాగించాలనేది నిర్ణయించుకోవాల్సి ఉంటుందని చెప్పారు.ఒక ఓటరుకు ఒకే ప్రాంతంలో మాత్రమే ఓటు హక్కు ఉండాలని,రెండు చోట్ల ఓటరు పేర్లు ఉండరాదని స్పష్టం చేశారు.ఓటర్లు తమ ఓటును కొనసాగించాలనుకున్న ప్రాంతాన్ని నిర్ణయించి,మరో ప్రాంతంలోని ఓటును తొలగించేందుకు సంబంధిత బీఎల్‌వోకు సమాచారం అందించాలని సూచించారు.ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు కాకపోవచ్చని,దీంతో వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు.అందువల్ల అర్హత కలిగిన ప్రతి ఓటరు నిర్ణీత గడువులోగా తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని సంబంధిత బీఎల్‌వోకు తప్పనిసరిగా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్ఏలు తమ పరిధిలో ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లకు అవగాహన



కల్పించి,వారు త్వరితగతిన ఫారాలు పూర్తి చేసి సమర్పించేలా చర్యలు తీసుకుంటూ అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

## డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి-సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలి:అదనపు కలెక్టర్ మధు మోహన్

బీఎల్‌వో యాప్‌లో ఓటర్ల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలి

గద్వాల,జూలై 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): ఓటరు జాబితా రూపకల్పనలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా,పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ అధికారులను ఆదేశించారు.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.ఈ సమావేశంలో జిల్లా ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ మధు మోహన్,సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ,ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌వోలు) యాప్‌లో ప్రతి ఓటరు వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి,ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. యాప్‌లో నమోదైన వివరాల ఆధారంగానే ముసాయిదా ఓటరు జాబితా రూపొందుతుందని,అందువల్ల ప్రతి నమోదును జాగ్రత్తగా పరిశీలించి అవసరమైతే వెంటనే సరిదిద్దాలని సూచించారు.డిజిటలైజేషన్ ప్రక్రియలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని,ప్రతి నమోదును సూపర్వైజర్లు క్షుణ్ణంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు.గైర్హాజరు,వలస వెళ్లిన,మృతి చెందిన ఓటర్ల వివరాలకు సంబంధించిన జాబితాలపై బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్ఏలు) సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు.పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓటర్ల సంఖ్య,భౌగోళిక పరిస్థితులు,అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని చేపట్టాలని సూచించారు.ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఓటరు జాబితా ఎన్నికల నిర్వహణ కోసం మాత్రమే రూపొందించబడుతుందని,ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతతో దీనికి ఎలాంటి సంబంధం లేదనే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించాలని అధికారులకు సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్ జిల్లాలోని తహసీల్దార్లు,ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా,నాణ్యతతో,తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఓటర్ల డిజిటలైజేషన్‌ను నిర్దేశిత గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని, బీఎల్‌వో యాప్‌లో వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి ప్రతి నమోదును సూపర్వైజర్లు ధృవీకరించాలని ఆదేశించారు.అలాగే పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం





చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి,రాజ్‌కుమార్, ఎన్నికల విభాగం అధికారి మంజుల,వివిధ మండలాల తహసీల్దార్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంగెం సర్పంచుల పోరంతో బిఅరెస్ పార్టీ సర్పంచులకు ఎలాంటి సంబంధం లేదు..!

- కాంగ్రెస్ పార్టీ కావాలనే కుట్రపూరితంగా మా పేర్లు ప్రకటించింది
- బీఆరెస్ సర్పంచులను గందరగోళానికి గురిచేసే కుట్ర
- పోరం కమిటీ తీరుపై మండిపడ్డ నల్లబెల్లి, చింతలపల్లి, షాపూర్ సర్పంచులు





**సంగెం, జూలై 29 (ప్రజాజ్యోతి) :** సంగెం మండలంలో ఇటీవల ప్రకటించిన "సర్పంచుల (పోరం) కమిటీ"తో బిఆర్ఎస్ పార్టీకి గానీ, తమకు గానీ ఎలాంటి సంబంధం లేదని మండల బిఆర్ఎస్ సర్పంచులు మెరుగు హేమలత-వీరేశం,బొమ్మ పావని-యుగేందర్,తుత్తూరు రమ-రవి యాదవ్ ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు కావాలనే రాజకీయ లబ్ధి పొందేందుకు నిన్న ప్రకటించిన సర్పంచుల పోరం కమిటీలో తమ పేర్లను చేర్చారని ఆరోపించారు. బిఆర్ఎస్ సర్పంచులను గందరగోళానికి గురిచేసేందుకే కాంగ్రెస్ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కమిటీకి, తమ పార్టీ విధానాలకు ఏమాత్రం ప్రమేయం లేదని తేల్చిచెప్పారు.

# వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొహమ్మద్ మసూద్**



**బచ్చన్నపేట, జూలై 29 (ప్రజాజ్యోతి) :** వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాలు, అతిసారం వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ మసూద్ సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కూలర్లు, డ్రమ్‌లు, ట్యాంకులు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా తరచూ శుభ్రం చేయాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, మరిగించిన లేదా శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగాలని, తాజా ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. దోమల నివారణ కోసం దోమతెరలు, దోమల నివారణ మందులు ఉపయోగించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ, మరియు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పారిశుధ్య చర్యలను మరింత వేగవంతం చేసి, దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పరిశుభ్రమైన వాతావరణాన్ని కాపాడితే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని మొహమ్మద్ మసూద్ పేర్కొన్నారు.

# సూక్య తండాలో ఎద్దు పొడిచి వ్యక్తికి తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు




**రాయపర్తి జూలై 29 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జయరాంతండా గ్రామ పంచాయతీ పరిధిలోని సుక్య తండా లో బుధవారం విషాదకర ఘటన చోటచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం రైతు గుగులోతు మను నాయక్‌ను తన స్వంత ఎద్దు కడుపులో పొడవటం తో తీవ్ర గాయమై ప్రేగులు బయటకు వచ్చిన ఘటన చోటచేసుకుంది. మంగళవారం మొత్తం వరి పొలంలో గొర్రు దున్ని వాటితో గడిపిన రైతు బుధవారం ఉదయం ఇంటి వద్ద వున్నా వాటిని మళ్లీ పోలంకు తీసుకుని పోదాం అని వాటి దగ్గరకు వెళ్ళగ పొడవటం జరిగింది. కుటుంబ సభ్యుల సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించగా చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

## నీట్ ఫలితాలలో తక్కువ మార్కులు - విద్యార్థిని మృతి

**- నిమ్స్‌లో చికిత్స పొందుతూ కృష్ణవేణి మృతి**



**పలిమెల జులై 29 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం పంకెన గ్రామానికి చెందిన పాగె కృష్ణవేణి నీట్ పరీక్షా ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయన్న మనస్తాపంతో గడ్డి మందు తాగి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పాగె కృష్ణవేణి తల్లితండ్రులు రాజయ్య చంద్రక్క వ్యవసాయ ఆధారిత కుటుంబం కాగా పై చదువుల కోసం నీట్ పరీక్ష రాసి ఇటీవలి నీట్ ఫలితాల్లో 405 మార్కులు సాధించింది. మంచి ర్యాంకు రాలేదని, తక్కువ మార్కులు వచ్చాయని తీవ్ర మానసిక ఒత్తిడికి, వేదనకు గురైందని, ఈ క్రమంలో సోమవారం ఉదయం నివాసంలో గడ్డి మందు తాగేసిందని గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని అక్కడి వైద్యుల సూచన మేరకు భూపాలపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్‌లో నిపుణులైన వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం ప్రాంతంలో కృష్ణవేణి కన్నుమూసిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కృష్ణవేణి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# సంస్కారం, క్రమశిక్షణతోనే విజయ శిఖరాలు ఎంఈవో ఏ. బిక్షపతి



**పర్వతగిరి, జూలై 29 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు, తిథి భోజనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో గురువుల పట్ల గౌరవభావం, నైతిక విలువలు, క్రమశిక్షణను పెంపొందించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గురువులకు అత్యున్నత స్థానం ఉందన్నారు. విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పే గురువులను, జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు. మంచి నడవడి, క్రమశిక్షణ, వినయం, సేవాభావం వంటి విలువలను అలవరచుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు సంస్కారం కూడా సమానంగా అవసరమని ఆయన పేర్కొన్నారు. తిథి భోజనం కార్యక్రమంలో భాగంగా అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు కె. సుభాషిణి విద్యార్థులకు అరటి పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయురాలికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తిథి భోజనం వంటి కార్యక్రమాలు విద్యార్థులకు పోషకాహారం అందించడంతో పాటు పాఠశాల, సమాజం మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదిగి విద్యలో మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిపిసి చైర్‌పర్సన్ నీరటి జ్యోతి, ఉపాధ్యాయులు లలితాదేవి, నవీన్ కుమార్, ప్రసాద్, కిషన్, ఆఫీస్ సబార్డినేట్ వంశీ పాల్గొన్నారు.

# అంతర్జాతీయ పులుల దినోత్సవం

- వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





**హనుమకొండ జిల్లా ప్రతినిధి, జూలై 29, (ప్రజా జ్యోతి) :** పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్య పరిరక్షణ కోసం వన్యప్రాణులను కాపాడుకోవడం అత్యంత అవసరమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జూ పార్కులో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పులుల దినోత్సవం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి ముకుంద రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పులి వన్యప్రాణుల్లో అత్యంత కీలకమైన జాతి అని, అడవుల పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో పులుల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. ఒకప్పుడు పులుల వేట విస్తృతంగా జరిగేదని, అటవీశాఖ చేపట్టిన కఠిన చర్యలతో అక్రమ వేట గణనీయంగా తగ్గి, దేశంలో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని తెలిపారు. దేశంలో చిరుతల (చీతాలు) సంఖ్య తగ్గిపోవడంతో వాటిని ఇతర ఖండాల నుంచి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలోని కవ్వాల్ పులుల అభయారణ్యంలో ప్రస్తుతం ఒక్క పులి కూడా లేకపోవడం ఆందోళనకరమని, అదే సమయంలో సమీపంలోని మహారాష్ట్ర తడోబా అభయారణ్యంలో పులుల సంఖ్య గణనీయంగా ఉందని తెలిపారు. అడవులు, వన్యప్రాణులు అంతరించిపోకుండా కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంపొందించుకొని, వాటి పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి ముకుంద రెడ్డి మాట్లాడుతూ, అంతరించిపోతున్న పులులతో పాటు ఇతర వన్యప్రాణులను సంరక్షించడం సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. వన్యప్రాణుల సంఖ్య తగ్గిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని, వాటి నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించడం అవసరమని తెలిపారు. భావితరాలకు ప్రకృతి సంపదను అందించాలంటే విద్యార్థులు వన్యప్రాణుల సంరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వోలు మయూరి, శిరీష, శ్రీనివాస్, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ప్రతినిధి శ్యామ్ సుందర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లను రద్దు చేయాలనే డిమాండ్లను తిప్పికొట్టాలి

- కుల వివక్ష, అసమానతలు తొలగినప్పుడే రిజర్వేషన్లపై చర్చకు అర్థం
- మాదిగ జాగృతి సంఘం సామాజిక కార్యకర్త సాంబ శివరావు



**ఏటూరునాగారం, జూలై 29 ప్రజా జ్యోతి :** రిజర్వేషన్లను తొలగించాలనే డిమాండ్ల వెనుక ఉన్న సామాజిక వాస్తవాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని మాదిగ జాగృతి సంఘం సామాజిక కార్యకర్త సాంబ శివన్ అన్నారు. రిజర్వేషన్లు ఎవరికీ ఉచితంగా లభించిన ప్రయోజనం కాదని, చారిత్రకంగా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజ్యాంగం కల్పించిన హక్కులలో భాగమని పేర్కొన్నారు. దేశంలో కుల వివక్ష, సామాజిక అసమానతలు పూర్తిగా తొలగిపోని పరిస్థితుల్లో రిజర్వేషన్లను రద్దు చేయాలని కోరడం సమంజసం కాదన్నారు. ముందుగా కుల వివక్షను నిర్మూలించడం, విద్య, ఉపాధి, భూమి, ఆర్థిక వనరుల్లో సమాన అవకాశాలు కల్పించడం కోసం ఉద్యమాలు జరగాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం వంటి విలువలకు ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. అణగారిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాల వల్లే నేడు వారు విద్య, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో ముందుకు వస్తున్నారని అన్నారు.

రిజర్వేషన్ల చరిత్ర, వాటి అవసరం తెలియకుండా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాల ప్రభావానికి యువత లోనుకావద్దని సాంబ శివన్ సూచించారు. రిజర్వేషన్లపై చర్చించాలంటే దేశంలో కొనసాగుతున్న కుల వివక్ష, సామాజిక--ఆర్థిక అసమానతలపై కూడా సమగ్రంగా చర్చ జరగాలని అన్నారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే డిమాండ్ చేసే వారు ముందుగా కుల వివక్ష నిర్మూలన, సమాన విద్యా అవకాశాలు, సమాన ఆర్థిక అవకాశాల కోసం ఉద్యమించాలని ఆయన కోరారు. రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయ సూత్రాలను పరిరక్షించేందుకు అణగారిన వర్గాల ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

# అర్హులైన ప్రతి ఓటర్ పేరు ఓటరు జాబితాలో నమోదు ఉండేలా చూడాలి

- ఎస్ ఐ ఆర్ ఇంటింటి సర్వే క్షుణ్ణంగా నిర్వహించాలి
- రాయపర్తి మండల బీఎల్ఏల పనితీరుపై సమీక్ష
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- పార్టీ బలోపేతంపై బిఎల్ఎలకు అవగాహన
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




**రాయపర్తి జూలై 29 ప్రజా జ్యోతి :** రాయపర్తి మండల బూత్ లెవల్ ఏజెంట్ల( బి ఎల్ ఏ) పనితీరుపై పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి బుధవారం పాలకుర్తి నియోజకవర్గం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా నిర్వహణ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ బలోపేతంపై బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేను క్షుణ్ణంగా నిర్వహించాలి అని కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మార్పులు, చేర్పులు వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వివరించాలని, పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో బీఎల్ఏల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు మరియు సంబంధిత నాయకులు పాల్గొన్నారు.

# మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ




**పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష**




**భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 29 (ప్రజా జ్యోతి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం రోజున ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు.అనంతరం రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు.

ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు ఎస్సై సాంబమూర్తి.పలిమేల ఎస్సై సాయి శశాంక్ మరియు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# గబ్బట చంద్రమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు

**ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**



**రాయపర్తి జులై 29 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామంలో బుధవారం గబ్బేట చంద్రమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించగా, రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు బుధవారం వారి కుటుంబాన్ని పరామర్శించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీలు బియ్యం ఆయిల్ క్యాన్ సహాయం చేసిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుబి పరుపటి శ్రీనివాస్ రెడ్డి.ఈ సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందించిన రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, ఐత రామచందర్, చందు రాము స్థానిక నాయకులు అయిన తాటికాయల కేతమ్మ, చిర్ర ఈరమ్మ, సంధి దేవేందర్ రెడ్డి, గబ్బేట యాకయ్య, గబ్బేట కొమురయ్య, సంకినేని ఎల్లస్వామి, కందుకూరి సమ్మయ్య, చిర్ర సప్తగిరి, గబ్బుట మహేందర్, చిర్ర సంతోష్, గబ్బుట నరేష్, గబ్బుట నాగరాజు, చిర్ర యుగేందర్ తదితరులు పాల్గొన్నారూ.

# రేషన్ కార్డు ఈ కేవైసీని పొడిగించాలి

**రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల భద్రయ్య**



**ప్రజాజ్యోతి-మొగుళ్ళ పల్లి (జూలై 29) :** ఈ నెల 31 తో ముగియనున్న రేషన్ కార్డు ఈ కేవైసి ని పొడగించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల భద్రయ్య అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫుడ్ సెక్యూరిటీ కార్డుకు ఈ కేవైసీ తప్పనిసరి అయినందున విద్యార్థులందరూ హాస్టల్లోనే ఉన్నారని తెలిపారు.ఫుడ్ సెక్యూరిటీ కార్డులో ఐదు సంవత్సరాలలో పు పిల్లలు ఉన్నందున వారి యొక్క ఆధార్ కార్డు అప్డేట్ కావాలంటే ఐదు సంవత్సరాలు నిండి ఉంటేనే తంబు వస్తుందని ఐదు సంవత్సరాలు నిండని పిల్లల యొక్క తంబు రావడం లేదన్నారు.కావున ప్రభుత్వం అధికారులు ఇట్టి విషయాన్ని గమనించి ఫుడ్ సెక్యూరిటీ కార్డు యొక్క ఈ కేవైసీని ఈనెల 31 వ తారీకు వరకు ఇచ్చిన గడువును మరొకసారి అవకాశం ఇచ్చిపొడిగించాలని కోరారు.

# సర్కిల్ ఆఫీస్‌ను తనిఖీ చేసిన బల్దియా కమిషనర్

**గోడలపై స్వచ్ఛతను చాటి చెప్పేలా చిత్రాలు వేయించండి**




**వరంగల్ సిటీ, జూలై 29 (ప్రజాజ్యోతి) :** కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని గోడలపై స్వచ్ఛతను చాటి చెప్పేలా రంగుల చిత్రాలు వేయించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. బుధవారం కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలోని ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, బర్త్ అండ్ డెత్ విభాగాల్లో క్షేత్రస్థాయి లో పర్యటించి నిర్వహిస్తున్న వీధుల తీరును అధికారులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా బర్త్ అండ్ డెత్ విభాగం ను సందర్శించి జనన, మరణ నమోదు వివరాలను ఆన్‌లైన్‌లో ఏ విధంగా నమోదు చేస్తున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకుని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని షట్టర్ల నిర్వహణపై డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడారు. షట్టర్ల ప్రాంతంలోని గోడలపై 'స్వచ్ఛ భారత్' సందేశాలు ప్రచారమయ్యేలా స్వచ్ఛతకు సంబంధించిన చక్కని పెయింటింగ్స్ వేయించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా నిబద్ధతతో విధి నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఏసీపీ ఖలీల్, సూపరింటెండెంట్ రామకృష్ణతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుడిపల్లిలో 'తెలంగాణ జలసిరి-జలసంచయ్' గ్రామసభ

గుడిపల్లి,జూలై 29(ప్రజాజ్యోతి): గుడిపల్లి గ్రామ పంచాయతీలో తెలంగాణ జలసిరి-జలసంచయ్ కార్యక్రమంపై ప్రత్యేక గ్రామసభను అత్యంత విజయవంతంగా నిర్వహించారు.ఈ గ్రామసభను ఉద్దేశించి గ్రామ సర్పంచ్ కున్‌రెడ్డి రాజశేఖర్ రెడ్డి ముఖ్య ప్రసంగం చేశారు. గ్రామాల్లో నీటి వనరుల





పరిరక్షణ, భూగర్భ జలాల పెంపుదల అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు. అలాగే గ్రామంలోని తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారాలకై ప్రజలతో కలిసి విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ విజయ్ రెడ్డి, ఉప సర్పంచ్ అర్వపల్లి శ్రీనయ్య, వార్డు సభ్యులు, వివిధ విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, సభను విజయవంతం చేశారు.

## భద్రతే లక్ష్యం.. హైవే షాపులకు సీసీ కెమెరాలు

గరిడేపల్లి,జూలై 29(ప్రజా జ్యోతి): జాతీయ రహదారి వెంట ఉన్న ప్రతి వ్యాపార సంస్థలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గరిడేపల్లి ఎస్సై బి.శ్రీకాంత్ గౌడ్ సూచించారు. గరిడేపల్లి మండల కేంద్రంలో ని జాతీయ రహదారిపై ఉన్న దుకాణాల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై




మాట్లాడుతూ,వ్యాపార సంస్థల భద్రతతో పాటు ప్రజల రక్షణ దృష్ట్యా ప్రతి షాపులో నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అత్యంత అవసరమ న్నారు.సీసీ కెమెరాలు నేరాల నివారణ లో కీలక పాత్ర పోషించడమే కాకుండా, దొంగతనాలు,ఇతర అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు నిందితులను వేగంగా గుర్తించి దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో భద్రతను మరింత బలోపేతం చేయడం, దొంగతనా లు మరియు ఇతర నేరాలను అరికట్టడం లక్ష్యంగా పోలీసులు ఈ చర్యలకు శ్రీకారం చుట్టినట్లు ఎస్సై వివరించారు.హైవే వెంట ఉన్న ప్రతి వ్యాపారి సామాజిక బాధ్యతతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. సమావేశానికి హాజరైన వ్యాపారులు పోలీసుల సూచనలను స్వాగతిస్తూ, తమ దుకాణాల్లో త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా చర్యలకు ప్రజల మద్దతు అవసరం

### – చింతకుంట్ల వెంకన్న

తుంగతుర్తి, జులై 29,(ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన హైడ్రా చర్యలకు ప్రజలు పూర్తి మద్దతు ఇవ్వాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న కోరారు. ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, పార్కులు తదితర ఉమ్మడి ఆస్తులను ఆక్రమణల నుంచి రక్షించేందుకు హైడ్రా ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. గతంలో అక్రమ ఆక్రమణల కారణంగా ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో వర్షాకాలంలో చెరువులు, నాలాలు మూసుకుపోవడంతో



ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం హైడ్రా చర్యల ద్వారా ఉమ్మడి ఆస్తులను పరిరక్షించే కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. హైడ్రా పనితీరును అడ్డుకునేలా కొందరు కోర్టులను ఆశ్రయించడం సరికాదని అభిప్రాయపడ్డారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తూనే ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హైడ్రా పనితీరును మరింత విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రజలు, మేధావులు, విద్యావేత్తలు, యువత, ఉద్యమకారులు, కవులు, కళాకారులు హైడ్రా చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలకు అండగా నిలవాలని వెంకన్న విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ తరాలకు ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు వంటి ఉమ్మడి ఆస్తులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ మేరకు పాత్రికేయులకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు.

## గురు పౌర్ణమి సందర్భంగా పౌరోహితుడికి ఘన సన్మానం

నార్కట్ పల్లి, జులై 29 ( ప్రజా జ్యోతి): గురు పౌర్ణమి సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గ్రామ అర్చకుడు బ్రహ్మశ్రీ ఉత్తరా పల్లి నరసింహాచార్యులకు మాంద్ర గ్రామంలోని మద్యెమ్మ దేవాల య ంలో, నార్కట్ పల్లి స్ఫూర్తి కాలేజీ దగ్గర గురుజ అశోక్ స్వామి నిర్మాణం చేసిన శ్రీ రేణుక ఎల్లమ్మ కాళీమాత దేవాల య ంలో దేవాలయ వ్యవస్థాప కులు గురుజ అశోక్ స్వామి, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘ న ంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామంలో అర్చకులు పౌరోహితులు అతనిని సంబోధించారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శిష్యం బృందం కొత్తపేట నరసింహాచార్యులు, మాసోజు నవీన్ శర్మ, చల్లేటి పవన్ కుమార్ చార్యులు, నరేష్ శర్మ, గురుజ క్రాంతి, రామచంద్రులు, గురుజ రాములు, ఉపేందర్ చారి, విక్రమాదిత్య ( చార్మి ), పాల్గొన్నారు.



# ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణమే లక్ష్యం

**ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

**60 ఫీట్ల రోడ్డు-నాలా బ్రిడ్జి కింద ప్రత్యామ్నాయ మార్గంపై అన్వేషణ**

**అమలైతే విద్యార్థులు, ఉద్యోగులు, కాలనీవాసులకు భారీ ఊరట**

**ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంపై ప్రత్యేక దృష్టి**

**బ్రిడ్జిని పరిశీలించిన ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**

సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూలై 29(ప్రజాజ్యోతి): వేగంగా విస్తరిస్తున్న సూర్యాపేట పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీతో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.ముఖ్యంగా 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టరేట్,ప్రభుత్వ కార్యాలయాలు,విద్యాసంస్థల వైపు వెళ్లే మార్గంలో ప్రతి రోజు విద్యార్థులు, ఉద్యోగులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో 60 ఫీట్ల రోడ్డులోని నాలా బ్రిడ్జి కింది భాగం



నుంచి ప్రత్యామ్నాయ రోడ్డు ఏర్పాటు చేసే అవకాశంపై బుధవారం కీలక క్షేత్రస్థాయి పరిశీలన జరిగింది.ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య,జిల్లా కాంగ్రెస్ నాయకుడు మొరిశెట్టి లక్ష్మాది,మున్సిపల్ కమిషనర్ సీహెచ్ హన్మంతరెడ్డి ఆర్ అండ్ బీ,మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు.రోడ్డు నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలు,సాధ్యాసాధ్యాలు,ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.ప్రస్తుతం కలెక్టరేట్,జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు,విద్యాసంస్థలు,నివాస కాలనీలకు వెళ్లే వాహనాలన్నీ ఒకే మార్గాన్ని వినియోగించడంతో ఉదయం,సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ తీవ్రంగా నిలిచిపోతోంది.ప్రతిపాదిత ప్రత్యామ్నాయ రోడ్డు అందుబాటులోకి వస్తే వాహనాల రద్దీ విభజన జరిగి ప్రధాన రహదారులపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఈ రహదారి నిర్మాణం పూర్తయితే పాఠశాలలు,కళాశాలలు,ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వేలాది మంది విద్యార్థులు,ఉద్యోగులకు ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా ఇంధన వ్యయం కూడా ఆదా కానుంది.అత్యవసర సేవలకు వెళ్లే అంబులెన్సులు,ఇతర వాహనాల రాకపోకలు కూడా వేగవంతం అయ్యే అవకాశముందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ,ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు.




ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు,ప్రజాప్రతినిధుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఈ పరిశీలనలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,స్థానిక కౌన్సిలర్ నాగుల వాసు,మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి,చిలుముల సునీల్ రెడ్డి,గుణగంటి హేమ సతీష్,దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్,సాజిద్ ఖాన్,నరేందర్ నాయుడు,రాచకొండ శ్రీనివాస్,సైదిరెడ్డి (మార్బుల్),జూలకంటి నాగరాజు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

## సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు.. పల్లకి సేవ.. అన్న దానంతో ఆధ్యాత్మిక శోభ

తుంగతుర్తి, జులై 29(ప్రజాజ్యోతి): గురు పౌర్ణమి పుణ్యదినాన్ని పురస్కరించుకొని తుంగతుర్తి మండల పరిధిలోని దేవుని గుట్ట తండా గ్రామంలో నీ శ్రీ



సద్గురు సాయిబాబా ఆలయంలో బుధవారం గురు పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త గుగులోతు బాలాజీ ఆధ్వర్యంలో అర్చకులు లక్ష్మణ్ సమక్షంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబా ఆశీస్సులు పొందారు. ఆలయంలో భక్తిమయ వాతావరణం నెలకొనగా, సాయిబాబా పల్లకి సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు చప్పట్లు కొడుతూ, భజనలు, సాయినామ సంకీర్తనలు ఆలపిస్తూ పల్లకి ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం అంతా "ఓం సాయిరామ్" నామస్మరణతో మార్మోగింది. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు ప్రసాదాన్ని స్వీకరించి సాయిబాబా కృపకు పాత్రులయ్యారు. గురు పౌర్ణమి సందర్భంగా గురువు స్థానం, గురుభక్తి యొక్క విశిష్టతను పలువురు వక్తలు వివరించారు. సమాజానికి మార్గదర్శకులైన గురువుల సేవలను కొనియాడుతూ పలువురు గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచి గుగులోతు స్వాతి భాస్కర్,భక్తులు దాయం ఝాన్సీ రాజిరెడ్డి,ఎనగందుల గిరి, గాజుల మహేందర్, సర్గం మల్లయ్య, ఎనగందుల సంజీవ,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా గురుపౌర్ణిమ వేడుకలు

## నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

నిడమానూరు,జూలై 29(ప్రజాజ్యోతి): నాగార్జున సాగర్ హిల్ కాలనీలో శిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం అత్యంత



వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నాగార్జునసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీను నాయక్ హాజరైయ్యారు . సాగర్ లో ఉదయం నుంచే గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని 29,30 తేదీల్లో ఈ ప్రత్యేక భక్తి కార్యక్రమాలను అమ్ములసాంబశివరావు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బుధవారం బాబావారికి కాకడ హారతినిర్వహించి నంతరం,సుప్రభాత, అభిషేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా చేపట్టారు.అనంతరం సామూహిక సాయి సత్యవ్రతములు,సంక్షేమసాయి సత్యవ్రత పఠనం అలాగే బాబావారి నిత్య ప్రార్థన పఠనం భక్తుల సమక్షంలో పవిత్రంగా



జరిగాయి.మధ్యాహ్నం సాయిబాబా ఊరేగింపు కార్యక్రమం అత్యంత శోభాయమానంగా ప్రారంభమైంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిర ప్రాంగణంలో జరుగుతున్న ఈ వేడుకల్లో చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు ఈర్ల రామకృష్ణ,పగడాల నాగరాజు, రాజగోపాల్ రెడ్డి,రఘువీర్ ,బిన్ని,వేణు, తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణలో మరో ముందడుగు.. జలసిరి

## జిల్లా సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు గుండు రామాంజి గౌడ్

గరిడేపల్లి,జూలై 29(ప్రజా జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమం నీటి సంరక్షణలో మరో ముందడుగని జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గుండు రామాంజి గౌడ్ అన్నారు. బుధవారం రాయినిగూడెం గ్రామంలో నిర్వహించిన జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు,మ్యాజిక్ డ్రైన్లు, బోర్‌వెల్ రీఛార్జ్,ఫార్మ్ పాండ్లు, ఇంటింటా ఇంకుడు గుంతలు, పొలాల్లో ఫార్మ్ కుంటలు, గ్రామాల్లో ఊర కుంటల ఏర్పాటు పై అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో సరోజతో కలిసి ఇంకుడు గుంతలు,డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గుండు రామాంజి గౌడ్ మాట్లాడుతూ, వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి గ్రామంలో సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని,ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఎంపీఓ సురేష్,ఎంపీఓ ఇబ్రహీం, సీసీ సుజాత,గ్రామ కార్యదర్శి సునీత,ఫీల్డ్ అసిస్టెంట్ సునీత, గ్రామ శాఖ సభ్యులు,వైస్ సర్పంచ్ నాగరాజ్,సభ్యుడు శ్రీకాంత్,గ్రామ అధ్యక్షుడు గుండు సాంబయ్య,గోవిందు,గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# గ్లోబల్ ఎంబీఏతో గడ్డిపల్లి యువకుడి ఘనత

## ఉన్నత విద్యలో మరో మైలురాయి సాధించిన వంశీకృష్ణ

గరిడేపల్లి,జూలై 29(ప్రజా జ్యోతి): సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామానికి చెందిన కొలిపాక వంశీకృష్ణ ఇంగ్లాండ్‌లోని ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీ ఆఫ్ పోర్ట్స్‌మౌత్‌లో గ్లోబల్ ఎంబీఏ కోర్సును విజయవంతంగా పూర్తి చేసి మరోసారి గ్రామీణ యువత ప్రతిభను ప్రపంచానికి చాటారు. బుధవారం జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలో ఆయన అధికారికంగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ ను అందుకున్నారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు విదేశాల్లో ఉన్నత విద్యను విజయవంతంగా పూర్తి చేయడం పై గడ్డిపల్లి గ్రామ ప్రజలు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.వంశీకృష్ణ సాధించిన ఈ ఘన విజయం మండల యువతకు స్ఫూర్తిదాయకమ ని,కృషి,పట్టుదల,లక్ష్యసాధన పట్ల నిబద్ధత ఉంటే ప్రపంచ స్థాయిలోనూ విజయాలు సాధించవచ్చని అభినందించారు ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు,స్నేహితులు, శ్రేయోభిలాషులు వంశీకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేశారు. వంశీకృష్ణ మాట్లాడుతూ,పోర్ట్స్ మౌత్ నగరం శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఈ చారిత్రక సంవత్సరంలో అదే నగరంలోని యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్ కావడం తనకు ఎంతో గర్వకార ణమని అన్నారు.తన విజయాని కి నిరంతరం అండగా నిలిచిన తల్లి అరుణకు,అలాగే తనకు సహకరించిన మిత్రులు,శ్రేయోభి లాషులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## తుంగతుర్తి కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేత

తుంగతుర్తి, జూలై 29,(ప్రజా జ్యోతి): తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ కంఠమయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గనికి కేంద్ర బిందువుగా ఉన్న తుంగతుర్తిలో నూతనంగా మంజూరైన ఫైర్ స్టేషన్ ను ఏర్పాటు




చేయడం వల్ల ఐదు మండలాలకు తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నూతనకల్ ప్రాంతాలకు సౌకర్యార్థంగా ఉంటుందని కోరారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ మరియు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ స్పందించి తుంగతుర్తిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు కోసం కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తడకమళ్ళ రవికుమార్, ఉప్పుల రాంబాబు, కొండ రాజు, గునిగంటి సంతోష్, బొంకూర్ మల్లేష్ బొజ్జ సాయికిరణ్, కొండగడుపుల వెంకటేష్, తడకమల్ల మల్లికార్జున్, బొంకురి మధు, బొంకూరి వెంకటేష్, తడకమళ్ళ అనిల్, బొంకూరి సాయి, తడకమల్ల మధు, కాసర్ల రాజశేఖర్, కొండ మధు, కాసర్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్

తుంగతుర్తి, జులై 29, (ప్రజా జ్యోతి): సర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ హరిసింగ్



అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నివాసం మార్చిన వారిని మరణించిన వారిని ఒకే పేరు రెండో సార్లు ఉన్న వారిని గుర్తించి తొలగించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్లో హేతుబద్ధీకరణ మొదలగు అంశాల పైన ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ కంఠమయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బంది మహేష్, శ్రవణ్ పాల్గొన్నారు.

### ఎంఆర్పిఎస్ అనుబంధ
# సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం

- ఎంఎంఎస్ మాదిగ మహిళా సమైక్య జాతీయ సమావేశం విజయవాడ కేంద్రం
- ముఖ్య అతిథిగా జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

**హత్నూర 29 జూలై (ప్రజాజ్యోతి)** మెదక్ ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు విజయవాడలో జాతీయ మహిళా సమావేశంలో పాల్గొనడం జరిగింది.రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ నుండి మహిళలు అధిక సంఖ్యలో సమావేశానికి హాజరవడం జరిగింది. సమావేశపు ముఖ్య అతిథులు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు గౌరవ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ సమాజంలో







తెలుగు రాష్ట్రాల మాదిగలే వెనుకబడ్డారని అన్నారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక జనాభా మాదిగలే ఉన్నారని గుర్తు చేసారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని మరొకసారి గుర్తు చేశారు.జనాభా ధమాస ప్రకారం రిజర్వేషన్ కేటాయిస్తే మాదిగలకు న్యాయం జరుగుతుందని అన్నారు.ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు కేటాయించకపోతే క్షేత్రస్థాయిలో ధర్నాలు నిర్వహిస్తామని అన్నారు.తధాన అనంతరం ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలు పల్లెపాటి మాధవి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల మాదిగ మహిళల అక్కలకు జై భీమ్ లు శుభాభివందనాలు తెలియజేస్తూ తెలుగు రాష్ట్రాలకు మందకృష్ణ మాదిగ లేకపోతే మన మాదిగ బతుకులు ఇంక గరీబ్ ధనంలో దిగజారితుండేనని ఆమె గుర్తు చేశారు. ఈ సమావేశం నిర్వహించడం పట్ల మాదిగ మహిళలకు చైతన్యవంతం కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక సమావేశ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్



జాతీయ అధ్యక్షురాలు గీత మాదిగ ఆఫీస్ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు జేపీ లతా తబిత నంబూరు మాదిగ ఆలపాటి కరుణ మాదిగ జానకి మాల విజయ మాదిగ నక్షత్ర రాష్ట్ర నాయకురాలు పెద్ద గీత మాదిగ సుజాత మాదిగ వివిధ జిల్లాల నుండి వచ్చిన ఎమ్మార్పీలు

# ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువు

- షాపుల అద్దెల ద్వారా ఆదాయం వస్తున్నా.. ప్రయాణికులకు మాత్రం ఇబ్బందులే

**రాయికోడ్ జూలై 29 (ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని రాయికోడ్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు హైదరాబాద్, నారాయణఖేడ్, నిజామాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు ఈ బస్టాండ్ నుంచి రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, ప్రయాణికుల అవసరాలకు తగిన ఏర్పాట్లు లేవని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఆదాయం వస్తున్నా.. సౌకర్యాలు మాత్రం శూన్యం**

బస్టాండ్ పరిధిలోని ఆర్టీసీ స్థలాలను షాపులు,హోటళ్లకు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నప్పటికీ,అదే ఆదాయంతో ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**తాగునీరు, బెంచీలు, మరుగుదొడ్లు లేక అవస్థలు**

బస్టాండ్‌లో కూర్చునే బెంచీలు లేకపోవడం,తాగునీటి సౌకర్యం లేకపోవడం,మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడం, లైటింగ్ లేకపోవడం వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.

**ప్రతిరోజూ వేలాది మంది రాకపోకలు**




బస్టాండ్ మండల కేంద్రానికి ప్రధాన రవాణా కేంద్రంగా ఉండటంతో ప్రతిరోజూ విద్యార్థులు,ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఈ బస్టాండ్‌ను వినియోగిస్తున్నారు. హైదరాబాద్, నారాయణఖేడ్, నిజామాబాద్, మెదక్ తదితర ప్రాంతాలకు నిత్యం బస్సులు నడుస్తున్నప్పటికీ, ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణమే సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి**

ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో తాగునీరు,పరిశుభ్రమైన






మరుగుదొడ్లు,కూర్చునే బెంచీలు,లైటింగ్‌తో పాటు ఇతర మౌలిక వసతులను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రయాణికులు,ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఢిల్లీలో ఢిల్లీ వసంత్‌కు జాతీయ పురస్కారంతో సత్కారం!

- విశిష్ట సామాజిక సేవలకు ప్రతిష్ఠాత్మక "వాగ్దేవి పురస్కారం" ప్రదానం
- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చేతుల మీదుగా ఘన సత్కారం

**జహీరాబాద్, జూలై 29 (ప్రజా జ్యోతి న్యూస్)** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా దశాబ్దాలుగా నిరంతర సామాజిక సేవలు అందిస్తూ, రైతు సంక్షేమ ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ, గ్రామీణాభివృద్ధి, యువత సాధికారత, ప్రజా సమస్యల పరిష్కారంలో విశేష కృషి చేస్తున్న తెలంగాణ ఉద్యమ కారుడు, జాతీయ రైతు ఉద్యమ నాయకుడు, గ్రామోదయ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు, జహీరాబాద్ కు చెందిన ప్రముఖ సామాజికవేత్త ఢిల్లీ వసంత్‌కు దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మక "వాగ్దేవి పురస్కారం" ఘనంగా ప్రదానం చేయబడింది. భారతదేశ సామాజిక, ప్రజా సేవా రంగాల్లో విశిష్ట కృషి చేసిన వ్యక్తులను గుర్తించి అందజేసే ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం, ఢిల్లీ వసంత్ ప్రజా జీవితంలో చేసిన సేవలకు జాతీయ స్థాయిలో లభించిన మరో అరుదైన గౌరవంగా నిలిచింది. ఈ పురస్కారాన్ని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చేతుల మీదుగా ఘనంగా అందజేశారు. ఢిల్లీ వసంత్ గత అనేక సంవత్సరాలుగా రైతుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు చేపట్టిన ఉద్యమాలు, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక చైతన్య కార్యక్రమాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన, స్వయం ఉపాధి ప్రోత్సాహం, ప్రజా సంక్షేమ కార్యక్రమా లతో పాటు యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 70 వేల కోట్ల రైతు రుణమాఫీ పథకం అమలులో రైతుల సమస్యలను జాతీయ స్థాయిలో వినిపిస్తూ అవగాహన కల్పించడంలో చేసిన కృషి, అలాగే దేశవ్యాప్తంగా సామాజిక, ఆధ్యాత్మిక చైతన్యం కోసం చేపట్టిన 7000 కిలోమీటర్ల "కుంభ సందేశ యాత్ర" వంటి విశిష్ట కార్యక్రమాలను పురస్కార కమిటీ ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఆయన సేవలను ప్రశంసించింది. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పై నిరంతరం స్పందిస్తూ, రైతుల హక్కుల పరిరక్షణ కోసం ప్రజా స్వామ్యబద్ధంగా ఉద్యమాలు నిర్వ హించడం, ప్రభుత్వాల దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం, రైతుల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా కృషి చేయడం ద్వారా ఢిల్లీ వసంత్ విశేష గుర్తింపు పొందారని కార్యక్రమం లో పాల్గొన్న ప్రముఖులు కొనియాడారు. గ్రామోదయ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక అవగాహన, స్వయం ఉపాధి అవకాశాలు,



సామాజిక బాధ్యతపై చైతన్యం కల్పించే అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి విశేషంగా దోహద పడుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. దేశ రాజధానిలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ఢిల్లీ వసంత్‌కు వాగ్దేవి పురస్కారం ప్రదానం కావడం జహీరాబాద్ ప్రాంత ప్రజలకు, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ప్రజా సేవకు అంకితమైన వ్యక్తులకు ఇలాంటి జాతీయ గుర్తింపులు సమాజానికి స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.

**ఢిల్లీ వసంత్ స్పందన**

పురస్కారం స్వీకరించిన అనంతరం ఢిల్లీ వసంత్ మాట్లాడుతూ, ఈ గౌరవాన్ని తన వ్యక్తిగత విజయంగా భావించడం లేదని, రైతులకు, యువతకు, తనతో కలిసి పని చేసిన సహచరులకు, తనపై విశ్వాసం ఉంచిన ప్రజలందరికీ అంకితం చేస్తున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసిన నిర్వాహకులకు, పురస్కారాన్ని అందజేసిన కేంద్ర మంత్రి, పార్లమెంట్ సభ్యులు, ప్రజాప్రతి నిధులు, ప్రముఖులకు





హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తు లో కూడా ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, యువత సాధికారత కోసం మరింత అంకితభావంతో సేవలను కొనసాగి స్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.ఎల్. లక్ష్మణ్, వేమారెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాగంట శ్రీనివాస్ రెడ్డి, బీద మస్తాన్ రావు,సీనియర్ నాయకులు సోము వీర్రాజు, కృష్ణ మోహన్ రావు తదితర ప్రముఖులు, తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, సాహితీ వేత్తలు, విద్యావేత్తలు, రైతు సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తెలంగాణకు చెందిన ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఢిల్లీ వసంత్‌కు అభినందనలు తెలియజేశారు.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

- సాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**అందోల్, జూలై 29, (ప్రజాజ్యోతి):** గురు పౌర్ణమి సందర్భంగా జోగిపేట పట్టణంలోని షిర్డీ సాయిబాబా దేవాలయం, సత్య సాయిబాబా దేవాలయాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఏఎంసీ చైర్మన్ డి.బి. నాగభూషణం, నాయకులు చాపల వెంకటేశం, బందం రాములు, వీరేశం, మల్లేశం, వడ్ల రాములు పాల్గొన్నారు. పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై బాబా ఆశీస్సులు పొందారు. సత్య సాయిబాబా దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం రెండు దేవాలయాల్లోనూ భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. షిర్డీ



సాయిబాబా ఆలయంలో అర్చకులు వడ్ల సుధాకర్, రాములు, యోగేష్ భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. గురు పౌర్ణమి వేడుకలు భక్తిపారవశ్య వాతావరణంలో ఘనంగా జరిగాయి.

# దైవ స్వరూపమే గురువు..!

- దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు
- వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు
- వేలాదిగా హాజరైన భక్తులు
- పీఠాధిపతులకు తులాభారం, రథోత్సవం



**జహీరాబాద్, జూలై 29(ప్రజా జ్యోతి న్యూస్)** అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగించే దైవస్వరూపమే గురువు. జీవితానికి దిశానిర్దేశం చేస్తూ ధర్మమార్గంలో నడిపించే వారే గురువులని బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీ శ్రీ 1008 వైరాగ్య శిఖామణి



అవధూత గిరి మహారాజ్, మహామండలేశ్వర్ డా.సిద్ధేశ్వరానంద గిరి మహారాజ్ తెలిపారు. బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా ఉదయం గోపూజ, వేద విద్యార్థులచే తల్లిదండ్రులకు పాదపూజ, గురు చరిత్ర పారాయణం, రుద్ర సహిత దత్త యజ్ఞం, అవధూత గిరి మహారాజ్ వారికి రథోత్సవం, రుద్రాక్ష మాలలతో తులాభారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ కేంద్ర మంత్రి భగవంత్ ఖూబా, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సునీత హనుమంతరావు పాటిల్తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గురుపాద పూజలో పాల్గొని గురువులను సన్మానించారు. తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు కూడా హాజరై



గురుపాదపూజల్లో పాల్గొన్నారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, బర్దిపూర్ ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

### పాఠశాల గది నుంచే
# దేశ నిర్మాణం మార్పు మొదలౌతుంది

- ఎంఎస్ ఫౌండేషన్

**జహీరాబాద్, జూలై 29(ప్రజా జ్యోతి న్యూస్)** ఎంఎస్ ఫౌండేషన్ సౌజన్యంతో బుధవారం జహీరాబాద్ మండలంలోని బుచినెల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలోని సుమారు 130 మంది విద్యార్థులకు ఉచితంగా షూస్ మరియు సరిపడు క్రీడా సామగ్రి పంపిణి కారిక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన జహిరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా. పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతు మంచి విలువలుగల విద్యార్థులవలనే సమాజం నిర్మాణం అవుతుంది. మన దేశ భవిష్యత్తు విద్య ద్వారానే సాధ్యమౌతుంది. క్రీడా ద్వార మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఇతరలతో స్నేహ భావం ఏర్పడుతుంది. ప్రస్తుత డిజిటల్ యుగం పిల్లల జీవితాలను మార్చేసింది. ఒకప్పుడు సాయంత్రం వేళ కాలనీలు, గ్రామ వీధులు, ఆట మైదానాలు పిల్లలతో కళకళ లాడేవి. ఫలితంగా పిల్లలు బయట ప్రపంచంతో గడిపే సమయం తగ్గిపోతోంది. పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, ఆటకు, విశ్రాంతికి, సృజనాత్మక కార్యకలాపాలకు తగిన సమయం దక్కేలా విద్యా విధానాలు రూపు దిద్దుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బుచినెల్లి గ్రామ సర్పంచ్ సునీత శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఇనాయత్ అలీ, పాఠశాల సిబ్బంది శోభ, హేమలత, విజయలక్ష్మి, శ్రీపాల్, రమేష్, విజయ్, గ్రామ నాయకులు గోవింద్ రెడ్డి, జనార్ధన్, రాజు, మల్లేశం, సుధాకర్, బసవరాజు, అమిత్ కుమార్, సంస్థ సిబ్బంది శ్రీకాంత్, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శ అధ్యక్షుడిగా పట్లోళ్ల కరుణాసాగర్ రెడ్డి

- సేవా కార్యక్రమాల విస్తరణకు కృషి చేస్తాం

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)** సమాజ సేవే లక్ష్యంగా పనిచేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శ నూతన కార్యవర్గ ఎన్నికలు మంగళవారం జోగిపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పట్లోళ్ల కరుణాసాగర్ రెడ్డి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడి ఎన్నిక సందర్భంగా క్లబ్ సభ్యులు, ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పట్లోళ్ల కరుణాసాగర్ రెడ్డి మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శను సేవా కార్యక్రమాల్లో మరింత ముందంజలో నిలిపేందుకు సభ్యులందరితో కలిసి కృషి చేస్తానని తెలిపారు. విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, యువత అభివృద్ధి, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు సహాయం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు మరింత విస్తరించేలా కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. సమాజానికి ఉపయోగపడే ప్రతి కార్యక్రమంలో క్లబ్ చురుకైన పాత్ర పోషించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. గత కార్యవర్గం క్లబ్ అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడిన ఆయన, వారి అనుభవాన్ని స్ఫూర్తిగా తీసుకుని నూతన కార్యవర్గంతో కలిసి మరిన్ని విశిష్ట సేవా కార్యక్రమాలు చేపట్టి లయన్స్ క్లబ్ ఆఫ్ ఆదర్శకు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు. సభ్యుల సహకారం, ప్రజల ఆదరణతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నూతన ప్రధాన కార్యదర్శిగా చెట్టి శివరాజ్, కోశాధికారిగా ఆది రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా యల్ నర్సింహ రెడ్డి, జింకల శివరాజ్, జాయింట్ సెక్రటరీగా ఎం. అభిలాష్ గౌడ్, డైరెక్టర్లుగా కొరివి ఆంజనేయులు, బత్తుల మహేష్ బాధ్యతలు స్వీకరించారు. మాజీ అధ్యక్షుడు వడ్ల ఆనంద్‌తో పాటు సభ్యులు జింకల రవి, కొండి శ్రీనివాస్, బుషిగారి కృష్ణ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.






### గురుపూర్ణిమ సందర్భంగా ఆశ్రమ పీఠాధి పతులను గురువులను దర్శించుకున్న
## ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ నరోత్తం



**జహీరాబాద్, జూలై 29 (ప్రజా జ్యోతి న్యూస్)** నియోజకవర్గ మండల పరిధిలోని గురు పూర్ణిమ సందర్భంగా ఎస్సి కార్పొరేషన్ మాజీ చెర్మెన్ వై.నరోత్తం గురువారం ఝరాసంఘం మండలం బర్దిపూర్ దత్తాగిరి ఆశ్రమం విరాగ్య శిఖామణి అవదూత గిరి మహరాజ్, ఆశ్రమ పీఠాదిపతి డా: సిద్దేశ్వ



రానందగిరి మహరాజ్, మరియు కుప్పానగర్ గ్రామంలో శ్రీ విరేశ్వర్ శివాచార్య (హీరే మఠ్ దనసిరి), మరియు కుప్పానగర్ గ్రామంలోని డా:బసవలింగ అవదూత (మల్లన్నగట్టు) ను దర్శించుకుని వారిని పూలమాలలు, శాలువా లతో సత్కరించి వారి ఆశీస్సులు పొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, పిఏసీఎస్ మాజీ చెర్మెన్ సిద్దన్న పాటిల్, మాణిక్ పాటిల్, యస్. గోపాల్, చెంగల్ జైపాల్, నబిసాబ్, కె.మల్లేశం, తదితరులు ఉన్నారు.

## మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా నరసింహ చారి, కార్యదర్శిగా సంగమేశ్వర్ ఘన విజయం!

◆ఉత్కంఠభరితంగా మెదక్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు నరసింహ చారి, సంగమేశ్వర్ ప్యానెల్ గెలుపు




**మెదక్ (ప్రజా జ్యోతి)** మెదక్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. క్లబ్‌లోని మొత్తం 98 ఓట్లకు గాను.. 96 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు సమయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అధ్యక్ష పదవికి జరిగిన హోరాహోరీ పోరులో నరసింహ చారికి 54 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి ప్రకాష్ 42 ఓట్లు సాధించారు. దీంతో నరసింహ చారి 12 ఓట్ల స్పష్టమైన మెజారిటీతో అధ్యక్షుడిగా ఘన విజయం సాధించారు. అలాగే జనరల్ సెక్రటరీ పదవికి జరిగిన పోటీలో సంగమేశ్వర్ 52






ఓట్లు సాధించి, 44 ఓట్లు పొందిన తన సమీప ప్రత్యర్థిపై 8 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నరసింహ చారి, జనరల్ సెక్రటరీ సంగమేశ్వర్‌లకు సహచర పాత్రికేయులు, ప్రెస్ క్లబ్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్యానెల్ ప్రతినిధులు వెల్లడించారు.

## కొమురవెల్లి మండల సమీక్ష సమావేశం నిర్వహణ

◆ తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామాభివృద్ధి పనులపై అధికారుల సమీక్ష
◆ సమన్వయంతో పనిచేయాలని సూచన

**కొమురవెల్లి, జూలై 29 (ప్రజాజ్యోతి):-** కొమురవెల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక అధికారి అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపీడీఓ, మండల పంచాయతీ అధికారి ఎంపీఓ, మండలంలోని సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మండలంలోని గ్రామాలకు సంబంధించిన తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, గ్రామాభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన





తదితర అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖల అధికారులు వాటిపై వివరణ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రత్యేక అధికారి అధికారులను ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా పనుల పురోగతిని సమీక్షించిన అధికారులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

## వర్షాకాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**నంగునూరు, జూలై 29(ప్రజా జ్యోతి):-** వర్షాలు రైతులకు ఆశలు నింపినా, ఆరోగ్య శాఖకు మాత్రం అప్రమత్తతను పెంచుతాయి. గ్రామాల్లో ఎక్కడైనా నిల్వ నీరు కనిపిస్తే డెంగీ, మలేరియా వంటి వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంటుంది. ప్రజల ఆరోగ్య భద్రత కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. హెచ్. ధనరాజ్ స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఆరోగ్య కేంద్రాల పనితీరును పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సేవల అమలు, టీకాల కార్యక్రమం, మందుల నిల్వలను పరిశీలించారు. వర్షాకాలంలో ఒక్క చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. ప్రతి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రతి మంగళవారం, శుక్రవారం 'డ్రై డే' నిర్వహించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. అలాగే, వర్షాల కారణంగా రవాణా ఇబ్బందులు ఎదురయ్యే గ్రామాల్లో గర్భిణులకు ముందస్తు వైద్య సహాయం అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. "ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యం" అనే సందేశంతో వైద్యశాఖ పనిచేస్తోందని పేర్కొన్న డీఎంహెచ్‌వో, ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు




అందాలని చెప్పారు. వైద్య సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యానికి తావులేదని హెచ్చరించారు. ఆరోగ్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

## ఉజ్వల ఉద్యోగ ప్రయాణానికి అవకాశాలు

◆ శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి రాజిరెడ్డి

**ములుగు, జూలై29 (ప్రజాజ్యోతి)** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నుండి బీఎస్సీ (ఆనర్స్) పట్టభద్రులకు ప్రభుత్వ, ప్రైవేటు, పారిశ్రామిక రంగాలలో విస్తృతమైన వృత్తి అవకాశాలు ఉన్నాయని ఉపకులపతి డా,దండ రాజిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ,విద్యా రంగంలో, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో, ఉద్యానవన, వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ఐ సి ఏ ఆర్ సంస్థలో ఉద్యానవన అధికారులుగా, పరిశోధనా సహాయకులుగా పనిచేయవచ్చునని వివరించారు. పట్టభద్రులకు విత్తన రంగం, నర్సరీలు, తోటల పెంపకంలో మంచి అవకాశాలు ఉన్నాయని, పట్టభద్రులు విత్తన సాంకేతికతకు, ఉద్యానవన పంటల భారీ స్థాయి ఉత్పత్తికి దోహదపడతారని, ప్రైవేటు, పారిశ్రామిక రంగంలో ఆహార శుద్ధి పరిశ్రమలు, వ్యవసాయ ఎగుమతి సంస్థలు,పుష్ప సాగు సంస్థలు, వ్యవసాయ వ్యాపారస్టార్టప్లలో ఉద్యాన వన పట్టభద్రులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. ల్యాండ్స్కేప్ డిజైన్,రక్షిత సాగు, హైడ్రోపోనిక్స్, వర్టికల్ ఫార్మింగ్లో నైపుణ్యాన్ని సాధించవచ్చునన్నారు. పట్టభద్రులైన కొందరు విద్యార్థులు నర్సరీలు, కణజాల సాగు,



కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి రాజిరెడ్డి

ప్రయోగశాలలు, సేంద్రియ వ్యవసాయ సంస్థలు, విలువ ఆధారిత ఉత్పత్తుల సంస్థలను స్థాపిస్తున్నారని తెలిపారు.

## బొడ్మట్‌పల్లి సర్పంచ్ పై డిపిఓకు వార్డు మెంబర్లు ఫిర్యాదు

◆ ఆరునెలల్లోనే అవినీతి ఆరోపణలు ఎదుర్కుంటున్న సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ కుమార్

◆ నిధుల దుర్వినియోగం పై మొన్న ఎంపీడీవో కు, నిన్న డిపిఓ కు ఫిర్యాదు

◆ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటున్న వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు.



**టేక్మాల్ ( ప్రజాజ్యోతి) జూలై 29:** మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ పంచాయతీ నిధులు దుర్వినియోగం పై జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యకు బుధవారం గ్రామ వార్డు మెంబర్లు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ నిధులను విచ్చలవిడిగా విత్ డ్రా చేసిన నిధులపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. గ్రామానికి సంబంధించిన నిధులను దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ఆలోచనతో సర్పంచ్ చేతివాటం ప్రదర్శిస్తున్నారని , ప్రజల సొమ్మును కాజేస్తున్నారని కొన్ని నిధులకు పంచాయతీ తీర్మానం లేకుండానే విత్ డ్రా లు చేశారనీ వార్డు సభ్యులు అంటున్నారు. గ్రామ పంచాయతీలకు అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయని వార్డు మెంబర్లు ఆరోపించారు. పని చేయని వార్డుల్లో పని చేసినట్లు బిల్లులు తయారు చేసుకొని తనకు ఇష్టం వచ్చినట్టుగా విత్ డ్రాలు చేస్తున్నారని అంటున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడినటువంటి వార్డు మెంబర్లమైన మేము పంచాయతీ లెక్కలు అడగగా నీ స్థాయి ఎంత నువ్వెంత నాకు లెక్కలు అడిగే స్థాయి కాదునిది అని హేళన చేస్తూ చాలా అవమానపరిచారని అన్నారు. ఈ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన బొడ్మట్ పల్లి గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ చేత రికవరీ చేయించి గ్రామ ప్రజలందరికీ పంచాయతీలో ఉన్న నిధుల గురించి తెలియజేసి న్యాయం చేయాలని వారు కోరారు. మొన్న ఎంపీడీవో సత్యనారాయణకు ఫిర్యాదు చేసిన ఎటువంటి స్పందన లేదన్నారు. కావున తమరు ఈ నిధులపై పూర్తి విచారణ జరపాలని వార్డు మెంబర్లు డిమాండ్ చేశారు. ఆరు నెలలోనే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్పంచ్ల ఫోరం రాష్ట్ర కార్యదర్శి తలారి అవినాష్ కుమార్ పై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వార్డు మెంబర్లు కంకర భూషణం, గడ్డం గోపాల్, మహమ్మద్ కరీం, నాయకులు దప్పు పెంటయ్య ఉన్నారు.

## ఆరోగ్యమే అసలైన సంపద

◆ ముందస్తు పరీక్షలతోనే క్యాన్సర్‌కు చెక్ ◆ శాశ్వత క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌కు శ్రీకారం ◆ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

**సిద్దిపేట,జులై 29,(ప్రజాజ్యోతి):** క్యాన్సర్‌పై పోరాటంలో ముందస్తు నిర్ధారణే అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని, ప్రజలు ముఖ్యంగా మహిళలు స్క్రీనింగ్ పరీక్షలను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేటలో శాశ్వత క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, త్వరలోనే దానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. సిద్ధిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో హైదరాబాద్‌కు చెందిన సింధు క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు







మాట్లాడుతూ, వైద్యశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో క్యాన్సర్ చివరి దశకు చేరిన తర్వాత చికిత్స కోసం వచ్చిన అనేక మంది రోగుల బాధను దగ్గరగా చూశానన్నారు. వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాత కాకుండా ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవడంతో పాటు ప్రాణాలను కాపాడే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుందని తెలిపారు. 40 సంవత్సరాలు దాటిన మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. మామోగ్రఫీ, పాప్ స్మియర్ వంటి పరీక్షలు సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక వ్యయంతో అందుబాటులో ఉంటాయని, అయితే ఈ శిబిరంలో పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం లేకుండా సింధు క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ పార్థసారథిని ప్రత్యేకంగా కోరడంతో 2.50 కోట్ల రూపాయల విలువైన అత్యాధునిక మొబైల్ స్క్రీనింగ్ యూనిట్‌ను సిద్దిపేటకు తీసుకొచ్చామని తెలిపారు. ఇందులో మామోగ్రఫీ, డిజిటల్ ఎక్స్‌రే, క్లినికల్ పరీక్షలు, శాంపిల్ కలెక్షన్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సిద్దిపేట ప్రజలకు ఈ సేవలు శాశ్వతంగా అందుబాటులో ఉండేలా ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి తరహాలోనే ఈ కేంద్రం ద్వారా నాణ్యమైన స్క్రీనింగ్ సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, త్వరలోనే శంకుస్థాపన నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షల్లో క్యాన్సర్ లక్షణాలు గుర్తించిన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సింధు క్యాన్సర్ ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే సింధు క్యాన్సర్ ఆసుపత్రి పనిచేస్తోందని కొనియాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేసిన హరీశ్ రావు, బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు 95 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులకు అవసరమైన నిధులు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. వెంటనే నిధులు కేటాయించి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. హోమియోపతి, యునానీ, ఆయుర్వేద ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింధు క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేష్, డాక్టర్ త్రిష, వైస్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, వైద్య బృందం, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## పాఠశాలపై దుండగుల దాడి... మూత్రశాల నీటి పైపులు ధ్వంసం

◆ పీఎం శ్రీ పాఠశాలలో భద్రతపై ఆందోళన ◆ నైట్ వాచ్‌మన్ ఏర్పాటు చేయాలని డిమాండ్

**కొమురవెల్లి, జూలై 29 (ప్రజా జ్యోతి):-** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరోసారి గుర్తుతెలియని దుండగుల విధ్వంసానికి గురైంది. పాఠశాల ఆవరణలోని మూత్రశాలలు, మరుగుదొడ్లకు అమర్చిన నీటి పైపులను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవలే పాఠశాల నూతన భవనంలోకి మారడంతో పాత భవనాల వైపు నిఘా సరిగా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని ఆకతాయిలు వరుసగా విధ్వంసాలకు పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు తెలిపారు. గతంలో కూడా పాఠశాల కిటికీలు, తలుపులు, విద్యార్థులు కూర్చునే బెంచీలు, బాత్రూం సామగ్రిని ధ్వంసం చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనలపై పలుమార్లు గ్రామ పెద్దలు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. పాఠశాల ప్రాంగణమంతా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ముఖ్యంగా పాత భవనాల పరిసరాల్లో నిఘా పెంచాలని, రాత్రి వేళల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని విద్యాశాఖ అధికారులను కోరారు. పీఎం శ్రీ పాఠశాల కావడంతో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, వృత్తి విద్యకు సంబంధించిన విలువైన సామగ్రి







పాఠశాలలో ఉందని, వాటి భద్రత కోసం రాత్రి వేళల్లో నైట్ వాచ్‌మన్‌ను నియమించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ~~~రాజ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఇటీవల కోతులు, ఆకతాయిల కారణంగా ధ్వంసమైన నల్లాలు, నీటి పైపులు, వాటర్ ట్యాంక్‌ను కొత్తగా మరమ్మతులు చేయించినప్పటికీ, కొందరు యువకులు సాయంత్రం వాలీబాల్ ఆడే సమయంలో కావాలనే పైపులను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్న దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పాఠశాల ఆస్తుల రక్షణ కోసం నైట్ వాచ్‌మన్‌ను నియమించి, అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. "ప్రభుత్వ ఆస్తులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. పాఠశాలలపై జరుగుతున్న విధ్వంసాలకు అడ్డుకట్ట వేయాలంటే నైట్ వాచ్‌మన్‌ను ఏర్పాటు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది" అని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (ఆనర్స్)కు ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోండి: రిజిస్ట్రార్ భగవాన్

**ములుగు, జూలై29 (ప్రజాజ్యోతి)** 2026-27 విద్యా సంవత్సరానికి గాను శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (ఆనర్స్) ఉద్యాన కోర్సుల ప్రవేశం కోసం ఆన్లైన్ దరఖాస్తు సమర్పించేందుకు ఆఖరి తేదీ ఆగస్టు16 వరకు పొడిగించినందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్ పేర్కొన్నారు. ఈ కోర్సు కాల పరిమితి నాలుగు సంవత్సరాల కాలపరిమితి నాలుగు సంవత్సరాలు కలిగి ఉంటుందని,శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని నాలుగు అనుబంధ కళాశాలలో దీన్ని అందిస్తున్నట్లు రిజిస్ట్రర్ భగవాన్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి మొత్తం 284 సీట్లు అందుబాటులో ఉన్నాయని,వీటిలో 230 రెగ్యులర్ సీట్లు కాగా,సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు 54 ఉన్నాయని, హైదరాబాద్ సమీపంలోని రాజేంద్రనగర్ లోని కళాశాలలో 90 సీట్లు,వనపర్తి జిల్లా మోజర్ల ఉద్యాన కళాశాలలో 80 సీట్లు,మహబూబాబాద్ జిల్లా మల్యాల్లోని ఉద్యానవన కళాశాలలో 30 సీట్లు,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట లోని ఉద్యానవన కళాశాలలో 30 సీట్ల కోసం ఆన్లైన్లో అప్లికేషన్లు నమోదు చేసుకోవాలన్నారు. రాజేంద్రనగర్ లోని ఉద్యానవన కళాశాలలో ఎన్ఆర్ఐ కోటా కింద 6 సీట్లు అదనంగా అందుబాటులో ఉన్నాయని,వీటిని విశ్వవిద్యాలయం విడిగా భర్తీ చేస్తుందని తెలిపారు. అప్లై చేసుకునే అభ్యర్థులు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా బోర్డు నిర్వహించే రెండేళ్ల ఇంటర్మీడియట్ పరీక్ష (బైపిసి),లేదా విశ్వవిద్యాలయం గుర్తించిన ఏదైనా సమాన పరీక్షలలో ఉత్తీర్ణులై ఉండాలని,అర్హత కోసం అవసరమైన సబ్జెక్టులు భౌతిక శాస్త్రం,జీవశాస్త్రాలు చదువుకొని ఉండాలన్నారు. దన్వయం నిధుల కోటా కింద ఉన్న సీట్లతో సహా అన్ని సీట్లకు అభ్యర్థుల ఎంపిక తెలంగాణ ఉన్నత విద్యా మండలి నిర్వహించే తెలంగాణ ఈఏపిసిఈటి-2026 ర్యాంకుల ఆధారంగా ఉంటుందన్నారు. ఒకవేళ ర్యాంకులలో టై అయిన సందర్భంలో అర్హత పరీక్షలోని ఐచ్చిక సబ్జెక్టులలో పొందిన మార్కులను పరిగణలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తు చేసుకునే ప్రతి అభ్యర్థి ప్రాస్పెక్టర్ను జాగ్రత్తగా చదవాలని,దరఖాస్తు ప్రక్రియ, అర్హత మరియు సీట్ల కేటాయింపు పై సమాచారం కోసం విశ్వవిద్యాలయ వెబ్సైట్ను సందర్శించాలని సూచించారు. ప్రాస్పెక్టర్స్ లో పేర్కొనని సమాచారం కోసం దరఖాసుదారులు పని దినాలలో ఉదయం 10:30 నుండి సాయంత్రం 4:30గంటల సమయంలో క్రింద తెలపబడిన 8019777490, 8333981354, 9652456779, 9440130030, 8977129027 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని లేదా **admissions.skltghu @gmail.com** కు ఈమెయిల్ చేయవచ్చని,ఇంకా ఏదైనా సమాచారం తెలుసుకోవాలంటే **www.skltghu.ac.in** నో క్రమం తప్పకుండా సందర్శించాలని తెలిపారు.

## శ్రీ షిరిడీ సాయిబాబాకు పుష్పాభిషేకం

- ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు
- స్వామివారిని దర్శించుకున్న మునిసిపల్ చైర్ పర్సన్ దంపతులు





తాండూరు జులై 29 ప్రజా జ్యోతి : తాండూరు పట్టణ శివారులోగల శ్రీ షిరిడీ సాయి బాబా దేవాలయంలో జరిగిన పుష్పార్చన పూజ కార్యక్రమంలో తాండూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ళ నీరజ బాల్‌రెడ్డి దంపతులు పాల్గొని సాయినాధులకి పుష్పాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ గురు పౌర్ణమిని పురస్కరించుకొని జరిగిన ఈ ఘనమైన పుష్పార్చన మహోత్సవంలో భాగంగా సాయి నాథున్ని దర్శించు కోవడం సంతోషకరమని అన్నారు. సాయిబాబా అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనేక మంది భక్తులు వివిధ రకాల పుష్పాలతో అభిషేకం చేయడం ఎంతో అద్భుతమైన కార్యమన్నారు. సాయినాథుని దివ్య ఆశీస్సులు తాండూర్ పట్టణ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలందరూ కూడ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు" తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి..గురువును కాదు..

### గురుతత్వాన్ని ఆరాధించే మహా పర్వం

- బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ
- శ్రీ శ్రీ హరి ప్రకాష్ మహారాజ్ ఆశీర్వాదం తీసుకున్న సత్యనారాయణ





కొత్తూర్ జులై 29 (ప్రజా జ్యోతి) : గురు పౌర్ణమి..గురువును కాదు.. గురుతత్వాన్ని ఆరాధించే మహా పర్వం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ అన్నారు. బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా హైదరాబాద్ లోని 1008మహామందస్వర్ ప్రంపూజయ గురువారర్ స్వామి శ్రీ శ్రీ హరిప్రకాష్ మహారాజ్ జీ గారి ఆశీర్వాదం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ పొందారు.

## వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజా జ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మరియు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి కలిసి దిగిన అరుదైన ఫోటోతో రూపొందించిన ఫ్రేమ్‌ను ఆయనకు జ్ఞాపికగా బహుకరించారు. ఆ ఫోటోను ఆసక్తిగా పరిశీలించిన జగన్ మోహన్ రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ, జ్ఞాపికను అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు తెలంగాణ సాయి మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట డివిజన్ దేవమ్మ బస్తీలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజా జ్యోతి) : జగద్గిరిగుట్ట డివిజన్ దేవమ్మ బస్తిలో 30 లక్షలు రూపాయలు చేపట్టిన అభివృద్ధి పనులు వాటర్ పైప్ లైన్, భూగర్భ డ్రైనేజీ పనులను బుధవారం స్థానిక నాయకుల తో కలసి మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

తను కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటినుండి డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పన కోసం కృషి చేశానని పేర్కొన్నారు. తన పదవీకాలం ముగిసినప్పటికీ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు డిఈ సంధ్య, ఎఈలు అభిరామ్, ఆశ, మాజీ డివిజన్ అధ్యక్షులు మల్లేష్ గౌడ్, మహేందర్, వినయ్, హనుమంతు, బ్రహ్మానంద చారి, ముంతాజ్, యాదగిరి, మనోజ్, ఖలీల్, అంజన్ యాదవ్, గోరేమియా, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణకు అంతా సహకరించాలి

కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ చింత సాయి తేజశ్వర్



కొత్తూర్ జులై 29 (ప్రజాజ్యోతి) : ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణకు అంతా సహకరించాలని కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ చింత సాయి తేజశ్వర్ చెప్పారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లో భాగంగా బుధవారం కొత్తూరు పాత మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ చింత సాయి తేజశ్వర్ ఇంటింటా తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు.ఓటర్లు ఫారాలను ఎలా నింపాలో తెలియజేస్తూ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అనర్హులు ఎవరు ఓటరు జాబితాలో నమోదు కాకుండా అర్హులంతా నమోదయ్యేలా అర్హులు ఎవరు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేలా సర్ ప్రక్రియ దోదపడుతుందన్నారు. ఫారాలను సేకరించడానికి బిఎల్వోలు ఇళ్లను సందర్శిస్తారని చెప్పారు.రెండు పారాలలో బిఎల్వో లు ఒక ఫారాన్ని ఓటర్ల వద్దే ఉంచి మరోపారాన్ని సేకరిస్తారని ఆయన చెప్పారు.ఈ బిఎల్వోలు కడెం పల్లి సుమిత్ర, వడ్ల అనిత,అరుంధ,ప్రవీణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# దైవ దర్శనాలకు ప్రత్యేక బస్సులు

- అరుణాచలం యాత్రకు శ్రీకారం
- వచ్చేనెల 3 నుండి ఐదు వరకు విహార యాత్ర
- ఆషాడ మాసంలో భక్తులకు దైవ దర్శనం కోసం టూరు
- వెల్లడించిన తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్






తాండూరు జులై 29 ప్రజా జ్యోతి :

తాండూర్ బస్ డిపో నుండి అరుణాచలం దైవ దర్శనం కోసం ప్రత్యేక టూర్ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తాండూర్ డిపో మేనేజర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్టిసి) ద్వారా ప్రత్యేక యాత్రకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇట్టి యాత్రకు బయలుదేరె భక్తులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం 3ఆగస్టు 2026 నుండి ఆగస్టు 5 వరకు తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. అరుణాచలం ఆధ్యాత్మిక టూర్ ఆర్టీసీ కోసం డీలక్స్ బస్సులో మూడు రోజుల పాటు యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్రలో ముఖ్యంగా శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం (కాణిపాకం), శ్రీ లక్ష్మీ నారాయణ గోల్డెన్ టెంపుల్ (వెల్లూరు), శ్రీ అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం (తిరువణ్ణామలై) లో దర్శించడంతో పాటు అరుణాచల గిరి ప్రదక్షిణ చేసే అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ అధికారులు నిర్ణయించిన మేరకు వచ్చే సోమవారం రాత్రి 9 గంటలకు తాండూర్ నుండి బయలుదేరి, 05 ఆగస్టు 2026 బుధవారం సాయంత్రం 5 గంటలకు అరుణాచలం నుంచి బయలుదేరి మరుసటి రోజు గురువారం ఉదయం వరకు తిరిగి తాండూర్ చేరుకుంటుందన్నారు. ఇట్టి ఆధ్యాత్మిక దర్శనానికి వెళ్లే భక్తులు ఆర్టీసీ నిర్ణయించిన మేరకు పెద్దలకు రూ 3వేల 600లు కాగా అఫ్ టికెట్ రూ 2 వేలుగా నిర్ణయించడం జరిగిందన్నారు.ఈ యాత్రలో భాగంగా దర్శనం, భోజనం, ఇతర వసతి ఖర్చులు అన్ని కూడ భక్తులే స్వయంగా భరించవలెనని చెప్పారు.ఆసక్తి గల భక్తులు తమ సీట్లను ముందుగానే రిజర్వు చేసుకోవాలని తాండూర్ డిపో మేనేజర్ కోరారు.బుకింగ్ కోసం సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు హుస్సేన్ ఎడిసి 9948947422 నవీన్ గౌడ్, సిస్టం సూపర్వైజర్ 8309348157లకు సంప్రదించాలని కోరారు.

# వానాకాలంలోనూ కరెంటు కష్టాలు





- రేవంత్ పాలన పూర్తిగా విఫలం
- మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్

వికారాబాద్ ప్రతినిధి, జూలై 29(ప్రజాజ్యోతి) : రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన పూర్తిగా విఫలమైందని, వానాకాలంలో కూడా ప్రజలు కరెంటు కష్టాలతో అల్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ తీవ్రంగా మండిపడ్డారు. బంట్వారం మండలం రొంపల్లి, మంగ్రాస్‌పల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన, ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు. పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో విద్యుత్ సరఫరా ఆదర్శంగా నిలిచిందని, ఎండాకాలంలో కూడా కరెంటు కోతలు లేకుండా ప్రజలకు సేవలు అందాయని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం వానాకాలంలోనే విద్యుత్ అంతరాయాలు సాధారణమైపోయాయని, ఇది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మిషన్ భగీరథ వంటి కీలక పథకాలను సైతం నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. గతంలో విజయవంతంగా అమలైన సంక్షేమ పథకాలు ఇప్పుడు కుంటుపడుతున్నాయని అన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రతి కార్యకర్త ప్రజల మధ్య చురుకుగా పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ బలం కార్యకర్తలేనని, ప్రతి ఇంటికీ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాలు









- వెంటనే చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు : బీఆర్ఎస్ నాయకులు

పరిగి, జూలై 29 (ప్రజాజ్యోతి) : పరిగి పట్టణంలో నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాలను అరికట్టాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం పరిగి వ్యవసాయ అధికారికి, పరిగి సబ్ ఇన్‌స్పెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం రైతులకు అవసరమైన డీఏపీ ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఎరువుల కొరత ఏర్పడి, దానిని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు నకిలీ డీఏపీ ఎరువులను రైతులకు విక్రయిస్తున్నారు

రైతులు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేస్తున్న ఎరువులు నకిలీవని తెలిసి తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, దీనివల్ల పంటల దిగుబడి దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. నకిలీ ఎరువుల తయారీ, నిల్వ, విక్రయాల్లో పాల్గొంటున్న వారిని వెంటనే గుర్తించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా రైతులు ఇంతటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ఈ సమస్యపై స్పందించకపోవడం దురదృష్టకరమని, ప్రజాప్రతినిధిగా రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యతను విస్మరించారని విమర్శించారు.

వ్యవసాయ శాఖ, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నకిలీ డీఏపీ ఎరువుల విక్రయాలను వెంటనే అరికట్టాలని, రైతులకు నాణ్యమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు డీఏపీ ఎరువులను అందుబాటులో ఉంచడంతో పాటు, నకిలీ ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ ఎంపిపి అరవింద్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, కౌన్సిలర్లు, మీర్ తాహేర్ అలీ, శివనోళ్ళ భాస్కర్, మాదారం సర్పంచ్ రాములు, ఆసిఫ్ తోపాటు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి పథంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం

93 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజా జ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం డివిజన్ లోని రోడా మేస్త్రి నగర్ లో రూ.31 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, అలాగే సుభాష్ చంద్రబోస్ నగర్--ఏలో సుమారు రూ.62 లక్షల వ్యయంతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని, ముఖ్యంగా వర్షాకాలంలో కాలనీల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ఈ సీసీ రోడ్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, జాకీర్ బలరాం, మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మహిళా నాయకురాలు పద్మ, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు గుమస్తా మధుసూదన్, రషీద్ బేగ్, సలీం, దుర్గేష్, నరేందర్, నాగేందర్, నబి, కొండయ్య, ఆనంద్, రాజు, కిషన్, నీలి శ్రీను, ఆబేద్, ఉస్మాన్, రజాక్ తదితరులు పాల్గొన్నారు

## హైడ్రా పై రాజకీయాలు తగదు

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజా జ్యోతి) : హైడ్రాధికారి రంగనాథ్ కమిషనర్ పదవి నుండి తొలగించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును నాణెంకు ఒకవైపు చూసి దాన్నే ఎత్తిచూపడం వల్ల గత ప్రభుత్వంలో జరిగిన కబ్జాలు ఎటుపోవని కాబట్టి హైకోర్ట్ తీర్పును రాజకీయం చేయవద్దని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పత్రిక ప్రకటనను విడుదల చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులు కుంటలు ప్రభుత్వ భూములు రక్షణ కొరకు ఏర్పడ్డ హైడ్రా కొద్ది రోజులలోనే అనేక మంచి మరియు ప్రజలకు నష్టం కలిగించే చర్యలు కూడా తీసుకున్నప్పటికీ వీటివల్ల ఎక్కువగా నష్టపోయింది కబ్జాదారులు మాత్రమేనని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ఏ నియోజకవర్గంలో చూసిన కుంటలు చెరువులు ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి ఏదో మధ్యతరగతి ప్రజలను మోసం చేశారని ఆ విషయాన్ని హైడ్రా వచ్చాక అనేక కూల్చివేతల వల్ల కబ్జాదారులకు నష్టం వాటిల్లడం వల్లనే కోర్టులకు పోయి అబద్ధపు సమాచారాన్ని ఇచ్చి వారి కబ్జాలను కాపాడుకుంటున్నారని అంతేకానీ పేద ప్రజలు హైడ్రాకి వ్యతిరేకంగా కోర్టుకు పోయిన సందర్భాలు చాలా తక్కువ అని కాబట్టి హైడ్రా లేక హైడ్రాధికారి రంగనాథ్ చర్యలు కబ్జాదారులకు నష్టమని అన్నారు. సిపిఐ గా కూడా హైడ్రా పై భిన్నభిప్రాయాలు ఉన్నప్పటికీ చెరువులు కుంటలు అభివృద్ధి విషయంలో హైడ్రాకు మద్దతిస్తూనే, పరికి చెరువు లో జరిగిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో హైడ్రా రంగనాథ్ విఫలమయ్యారని ఇటువంటి విషయంలో హైడ్రాను తప్పుపట్టుతున్నామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో పక్షపాత,సొంత రాజకీయ నాయకుల అభిప్రాయాలను పరిగనణలోకి తీసుకొని హైడ్రా ను సొంత సంస్థ లాగా ఉపయోగించుకోవడం వల్లే నేడు హైకోర్టు ఇచ్చిన తీర్పుకు కారణమని కావున రేవంత్ రెడ్డి నిష్పాక్షపాతంగా వ్యవహరించి గత టిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్యాక్రాంతమైన భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.

## వచ్చే నెల 5న చలో వికారాబాద్

- రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు యం రమేష్ ను కలిసిన జేఏసీ నాయకుడు
- బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ సదస్సుకు రావాలని ఆహ్వానం
- వికారాబాద్ రానున్న డాక్టర్ విశారదన్ మహారాజ్



తాండూరు జులై 29 ప్రజా జ్యోతి : వచ్చే నెల 5న వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే బీసీ, ఎస్సీ, ఎస్టీ జెఎసి సదస్సుకు తాండూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మల్కూడ్ రమేష్ మహారాజ్‌ను కలిసిన బీసీ, ఎస్సీ,ఎస్టీ జేఎసి జిల్లా ఇన్చార్జి శ్రీనివాస్ ప్రత్యేక ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 5న వికారాబాద్ జిల్లా ఎన్నెపల్లి లో గల గుప్త చాయ ఏసీ బంక్వేట్ హాల్ నందు జరుప తలపెట్టిన బిసి,ఎస్సీ,ఎస్టీ, జేఏసీ వికారాబాద్ జిల్లా ఆవిర్భావ సదస్సుకు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ముఖ్య అతిథిగా రానున్నట్లు చెప్పారు. ఇట్టి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ,ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందిన విద్యావంతులు యువకులు మేధావులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, శేఖర్, నర్సింలు, శివకుమార్ ముదిరాజ్‌లు ఉన్నారు.

## రాజీవ్, ఇందిరమ్మ కాలనీల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

- వాహనాల రాకపోకలతో ప్రయాణికులు, విద్యార్థులకు ఇబ్బందులు
- రెండు వైపులా బస్ స్టాఫ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికుల విన్నపం



తాండూరు జులై 29 ప్రజా జ్యోతి : వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ సమీపంలోని రాజీవ్, ఇందిరమ్మ కాలనీల వద్ద ప్రణికులు,విద్యార్థుల సౌకర్యార్థం బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని స్థానిక కాలనీలకు చెందిన ప్రజలు కోరుతున్నారు. తాండూరు, హైదరాబాదు ప్రధాన రోడ్డు మార్గం కావడంతో వాహనాల రద్దీ కూడ అధికంగా ఉంటుందని చెప్పారు. ఇందిరమ్మ, రాజీవ్ కాలనీ నుండి ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసించే వందలాది మంది విద్యార్థులతో పాటు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు స్పందించి రెండు వైపులా కూడ ఆర్టీసీ బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా వాహనాల రాక పోకలలో వేగాన్ని నియంత్రించే విధంగా స్పీడ్ బ్రేకర్లు గాని నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన స్వీట్స్ అందించాలి

- మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్
- చేగూర్‌లో జై బాలాజీ రామ్ లాల్ స్వీట్ హౌస్ ప్రారంభం
- ప్రోపరేటర్ అరవింద్ మీర్జాకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపిన దేవేందర్ యాదవ్,కోస్గి శ్రీనివాస్



కొత్తూర్ జులై 29 (ప్రజా జ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన స్వీట్స్ అందించాలని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు.బుధవారం నందిగామ మండలంలోని చేగూర్ లో జై బాలాజీ రామ్ లాల్ స్వీట్ హౌస్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్ హాజరై ప్రోపరేటర్ అరవింద్ మీర్జా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినియోగదారులకు మంచి స్వీట్స్ అందిస్తే వ్యాపారంలో రాణించవచ్చని వారు సూచించారు.

## అభివృద్ధికి వారధులు... ప్రధాన రహదారులు

- 62.00 లక్షలతో నూతన నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను పరిశీలించిన బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ జులై 29(ప్రజాజ్యోతి) : 126జగద్గిరిగుట్ట డివిజన్ పైప్ లైన్ రోడ్డులోని 62.00 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.అభివృద్ధికి వారధులు, ప్రధాన రహదారులని అన్నారు. గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలను అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా ప్రజల సౌకర్యార్థం మరిన్ని రహదారులను మెరుగు పరుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డీఈ సంధ్య, ఏఈ లు ఆశా, అభిరామ్, మాజీ కార్పొరేటర్ జగన్, వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవీందర్, కిషోర్, నాయకులు బస్వరాజ్, మెట్ల శ్రీను, బ్రహ్మానంద చారి తదితరులు పాల్గొన్నారు.

## బోలిశెట్టి నారాయణను పరామర్శించిన ఎమ్మెల్యే

రాయికల్,జూలై 29 (ప్రజా జ్యోతి)

రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొలిశెట్టి నారాయణ ఇటీవల మోకాలు శస్త్రచికిత్స చేయించుకోగా, జగిత్యాల ఎమ్మెల్యే



డా. సంజయ్ కుమార్ మంగళవారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బెజ్జంకి మోహన్, సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్, గుజ్జుల మోహన్ రెడ్డి,సూర విజయ్, వంశీ కృష్ణ,తిరుపతి గౌడ్, పలువురు సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి :ఎస్సై

కొడిమ్యాల,జూలై 29,(ప్రజాజ్యోతి):



మండలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఏ. నరేష్ కుమార్ సూచించారు.బుధ వారం ఓ ప్రకటనలో ఆయన పలు సూచనలు చేశారు. రైతులు పొలం పనులకు వెళ్లే సమయంలో విద్యుత్ స్తంభాలు, మోటార్ స్టార్టర్లు, విద్యుత్ కనెక్షన్లకు దూరంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చెరువులు, కుంటలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున అవసరమైతే తప్ప దూర ప్రయాణాలు చేయవద్దని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం, ఎవరూ చెరువులు, కుంటల్లో ఈతకు దిగడం చేయరాదని హెచ్చరించారు. బలమైన గాలులు, వర్షాల కారణంగా చెట్లు, కొమ్మలు విరిగి పడే ప్రమాదంతో పాటు శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలే అవకాశం ఉన్నందున అలాంటి ప్రాంతాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్సై తెలిపారు.

## వర్షాల వేళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్

సుల్తానాబాద్: జులై 29( ప్రజా జ్యోతి):



మండలంలోని కాట్నపెల్లి గ్రామంలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ కోరారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉన్నందున ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని సూచించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, రైతులు పొలాలకు వెళ్లే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా రైస్ మిల్లులు, ఇటుక బట్టీలు, వ్యవసాయ పొలాల పరిసరాల్లో విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటిలో మునిగిన విద్యుత్ తీగలను తాకరాదని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే గ్రామ పంచాయతీ సిబ్బంది లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ పరస్పరం సహకరించుకోవాలని, చిన్నపిల్లలను నీటి ప్రవాహాలు, చెరువులు, కాలువల వద్దకు వెళ్లని వ్వొద్దని సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ విజ్ఞప్తి చేశారు.

## వర్షాలపై అప్రమత్తం.. లోతట్టు ప్రాంతాల్లో అధికారుల విస్తృత పర్యటన

సుల్తానాబాద్: జులై 29 (ప్రజా జ్యోతి):

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, కమిషనర్ టి. రమేష్ మున్సిపల్ పరిధిలోని 4వ, 15వ వార్డులలోని



లోతట్టు ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా కాలువల పారుదలపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన చోట వెంటనే చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా 15వ వార్డు కౌన్సిలర్ గాదాసు మంజుల రవీందర్ పర్యటనలో పాల్గొని స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే మున్సిపల్ యంత్రాంగానికి సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ కమిషనర్ 7396224440, మున్సిపల్ చైర్మన్ 6309532229 నంబర్లను సంప్రదించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తూ సహాయక చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

## హన్మజీపేట గురుపౌర్ణమి పూజలో పాల్గొన్న బీజేపీ నాయకులు

వేములవాడ,జులై,29,ప్రజాజ్యోతి.

గురు పౌర్ణమిపురస్కరించుకుని హన్మాజిపేట గ్రామంలోనీ మార్కెండాయ స్వామి గుడిలో



గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ జక్కుల తిరుపతి మాట్లాడుతూ శ్రీ శిరిడి సాయిబాబా భక్తశివ మార్కండేయ దేవస్థానం ట్రస్ట్ వారి ఆహ్వానం మేరకు దర్శనం చేసుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ఈ ఏడు వర్షాభావం తక్కువ ఉన్నందున సకాలంలో వర్షాలు పడి రైతులకు అన్ని వర్గాల ప్రజలకు ఆ దేవుని ఆశీర్వాదం ఉండాలని కోరుతూ ఈ యొక్క గుడిలో భజన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని భజనలుచేయడం చాలా ఆనందంగా ఉందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంకె.మధు స్థానిక వార్డు సభ్యులు బిజెపి నాయకులు ఆడెపు.విజయ్, మల్లారపు.తిరుపతి, కిషన్ రెడ్డి ట్రస్ట్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# రోగులకు ఇబ్బందులు రానీయెద్దు..

**ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి**

**అవసరమైన మరమ్మత్తులు చేయించండి**

**కలెక్టర్ చిత్రా మిశ్రా వెల్లడి**

కరీంనగర్ బ్యూరో, జూలై 29(:ప్రజాజ్యోతి ):

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి జిల్లా ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్)ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవలు, మౌలిక సదుపాయాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.తనిఖీలో భాగంగా సదరం వేయిటింగ్ హాల్, ఫార్మసీ, సిటీ స్కాన్ విభాగం, ఆరోగ్యశ్రీ కౌంటర్, సీనియర్ సిటిజన్ వార్డు, ఎమర్జెన్సీ వార్డు, సర్జికల్ రూమ్, ఓపీ విభాగం, ఆపరేషన్ థియేటర్, ఎన్ఎస్‌డీ క్లినిక్, పల్మనాలజీ వార్డులను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఎంసీహెచ్ మాదిరిగా రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు తగిన బెంచీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆస్పత్రిలో ఎక్కడైనా లీకేజీలు, మరమ్మత్తులు అవసరమైన ప్రాంతాలు



ఉంటే వెంటనే పూర్తి చేయాలని టీజీఎం ఐడీసీ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, కనీస సౌకర్యాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండొద్దని సూచించారు. ఫ్లోరింగ్, దెబ్బతిన్న గోడల మరమ్మత్తులు, తాగునీటి సరఫరా, వాటర్ స్టోరేజ్, విద్యుత్ పనులు, అంతర్గత రహదారులు, వైద్యుల గదుల్లో అవసరమైన సౌకర్యాలు, అదనపు బెడ్ల ఏర్పాటు వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.వర్షపు నీరు ఆస్పత్రి ప్రాంగణంలో నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సేవలు అందించాలని, ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా ప్రతి వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

**ఆస్పత్రి నిర్వహణపై సమగ్ర సమీక్ష:**

తనిఖీ అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి ఛాంబర్‌లో ఆర్ఎంఓ డాక్టర్ నవీనా, ఇతర వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వివరాలు, వారు పనిచేస్తున్న ఏజెన్సీలు, ఆస్పత్రి ఆదాయం-వ్యయాలు, నిధుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు.ప్రతి నెల, మూడు నెలలు, ఆరు నెలలు, వార్షిక ప్రాతిపదికన ఆదాయం-వ్యయాల బడ్జెట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రికి సంబంధించిన భవనాల అద్దెలు, అంబులెన్సులు, జనరేటర్లు, వైద్య



పరికరాలు, ఏసీలు, సీసీ కెమెరాలు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించిన కలెక్టర్, ఆస్పత్రి నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ నవీనా, వైద్యాధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షంలోనూ కొండగట్టు గిరి ప్రదక్షిణ

**కొండగట్టు గిరిప్రదక్షిణలో పాల్గొన్న మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్**

**వర్షాలు సమృద్ధిగా కురవాలనే సంకల్పంతో గిరి ప్రదక్షిణ : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

మల్యాల, జూలై 29, ప్రజా జ్యోతి :

వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు ప్రజలు సుభిక్షంగా ఉండాలని పంటలు బాగా పండాలనే స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాదిగా భక్తులు పాల్గొనడం వారి అపారమైన భక్తికి









నిదర్శనమన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ గురు వ్యాస పౌర్ణమి గిరిప్రదక్షిణకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు.

తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. వర్ష పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేశారని, భక్తులు సురక్షితంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు కల్పించినట్లు వెల్లడించారు. భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని తెలిపారు. ఈ ప్రదక్షిణలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పూజరులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంకల్పం నెరవేరినట్లే ఉందని గిరి ప్రదక్షణ వ్యవస్థాపకులు చిలుకూరి బాలాజీ శివాలయం అర్చకులు ఆత్మారాం మహారాజ్ అన్నారు. గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన 43వ గిరిప్రదక్షిణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి తో పాటుగా సత్యం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్,ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు.బుధవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులతో కలిసి ప్రజాప్రతినిధులు గిరిప్రదక్షిణ పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి, సుభిక్షం కోసం ప్రార్థించామని వారు తెలిపారు .ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కొండగట్టు ఆంజనేయ స్వామి మహిమ అపారమని, ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణలో పాల్గొంటారని ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. అనంతరం రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా కొండగట్టు గిరిప్రదక్షిణలో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు కల్పించిందన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలోని అత్యంత పవిత్రమైన ఆంజనేయ క్షేత్రాల్లో కొండగట్టు ఒకటని అన్నారు. భక్తుల విశ్వాసానికి నిలయమైన ఈ క్షేత్రానికి ప్రభుత్వం అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేస్తోందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

అనంతరం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రకృతి అనుకూలించి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని,

## జలసిరి పనుల్లో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి

**ఎంపీడీవో స్వరూప**

కొడిమ్యాల, జూలై 29(ప్రజాజ్యోతి):

గ్రామాభివృద్ధి, నీటి సంరక్షణ కార్యక్రమాల సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో తొలగింపు, ఆయిల్ బాల్స్ వినియోగం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రమాదకర





అమలులో సర్పంచులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో స్వరూప సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి లత అధ్యక్షతన సర్పంచులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు తక్కువ నీటితో సాగయ్యే, వర్షాభావాన్ని తట్టుకునే పంటలను చేపట్టనున్న జలసిరి కార్యక్రమాన్ని ఆగస్టు 1 నుంచి 15 వరకు ప్రత్యేక డ్రైవ్‌గా నిర్వహించి, ఫార్మ్‌పాండ్లు, ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, బోర్‌వెల్ రీచార్జ్ పిట్లు, కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణాన్ని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిల్వ నీటిని తొలగించడం, మురుగు కాలువలను శుభ్రం చేయడం, చెత్త పరిస్థితులు తలెత్తితే ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువుల్లో చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి గ్రామంలో డ్రైడే కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు,వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి అధికారులు బాధ్యతగా పనిచేయాలి

**సమీక్షా సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

వెల్గటూర్, జూలై 29,ప్రజా జ్యోతి:

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన అభివృద్ధి సమీక్ష సమావేశంలో వారు పాల్గొని,గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరా,



పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీల అవసరాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ప్రభుత్వం అవసరమైన నిధులు అందిస్తుందని మంత్రి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసిన బీఎల్ఓలను మంత్రి సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట ప్రభుత్వ ఆదేశాలతో భూముల రీ సర్వే : తహసీల్దార్

ఇల్లంతకుంట జూలై 29(ప్రజజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం మొత్తం భూముల విషయం లో రీ సర్వే చేయుటకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని రాజన్న సిరిసిల్ల జిల్లా



ఇల్లంతకుంట తహసీల్దార్ రాచకాట్ల సురేష్ తెలిపారు. సర్వేలో భాగంగా మొదట సిరికొండ గ్రామం ఎంపిక అయ్యిందన్నారు ఈ సందర్భంగా సిరికొండ గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించడం జరిగిందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడి, సర్వేయర్, లైసెన్స్ సర్వేయర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

వేములవాడ,జూలై,29:ప్రజా జ్యోతి.

వేములవాడ పట్టణంలోని 26వ 26 వార్డు కౌన్సిలర్ మామిండ్ల అమర్ల లక్ష్మీరాజ్యం ప్రజలకు వార్డు సభ్యులకు వార్డు ప్రజలకు వర్షాకాలంలో వానలు పడుతున్నందున ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని పరిశుభ్రమైన నీరు తాగాలని కరెంటు పోల్ వద్దకు



వెళ్ళవద్దని తడి చేతులతో కరెంటు ముట్ట వద్దని చిన్నపిల్లలను వృద్ధులను అత్యవసరం తప్ప బయటకు వెళ్ళని వద్దని అవసరమైన వారు తగు జాగ్రత్తలు తీసుకుంటూ బయటకు వెళ్ళవలెను అన్నారు ముఖ్యంగా అంటువ్యాధులు విష జ్వరాలు జలుబు దగ్గు ఊపిరితిత్తుల వ్యాధులు పేగులకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువ ఉంటాయని నివారణ మార్గంగా పరిశుభ్రత పాటించాలని కోరారు.

# ఫిన్లాండ్ విద్యా వ్యవస్థ పై నేడు సీఎం సమీక్ష

♦ సమీక్షలో పాల్గొనున్న నేలకొండపల్లి యంఈవో
♦ స్థానిక ఉపాధ్యాయులు ఘన సన్మానం

నేలకొండపల్లి, జూలై 29 ప్రజాజ్యోతి: ఫిన్లాండ్ విద్యా వ్యవస్థ పై రాష్ట్ర బృందం జరిపిన ఆధ్యాయన బృందం తో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు. ఈ మేరకు సమీక్షకు ఫిన్లాండ్ బృందం ప్రతినిధి, నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు హాజరుకానున్నారు. ఏప్రిల్ 18 నుంచి 26 వరకు ఫిన్లాండ్ లో పర్యటించారు. బృందం ప్రతినిధి గా ఉన్న నేలకొండపల్లి యంఈవో చలపతిరావు ను సమీక్షకు హజరు కావాలని సీయంవో ను ఉత్తర్వలు అందాయి. అక్కడి విద్యా విధానం ను సీఎం కు సమీక్ష లో వివరించనున్నారు. విద్యా లో దూసుకెళ్లేందుకు అక్కడి 'ప్రభుత్వం తీసుకుంటున్న విధి, విధానాలను వివరించనున్నారు. సీఎం' సమీక్ష లో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా బుధవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో నేలకొండపల్లి మండల



ఖ్యాతిని పెంచాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్కుమార్, స్వామి, మాధవ్, శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు టి.వెంగళరావు, బీ.శ్రీనివాస్, తొర్తి సురేష్, కోటేశ్వరరావు, చీనా తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

♦ టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు

ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కంచర్ల శ్రీనివాసరావు, నంద్రు వెంకటేశ్వరరావులి లు డిమాండ్ చేశారు.బుధవారం ఎర్రుపాలెం మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో , ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులకు బదిలీలను తక్షణమే నిర్వహించి, కేడరీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, 010 హెడ్ ద్వారా జీతాలు చెల్లించే విధానాన్ని వెంటనే అమలు



చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి, పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కేర్ టేకర్ ను నియమించాలని, ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ ఇవ్వాలని, పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని 317 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడంలో గురుకుల విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు అనేక సేవా, పరిపాలనా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గురుకుల విద్యారంగంలో పనిచేసే ఉపాధ్యాయుల, ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించడం వల్ల విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించకపోతే టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. గురుకుల విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే మొదటి అడుగని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ ఎర్రుపాలెం మండల ఉపాధ్యక్షులు నీలం సైదారావు పిడి నాగేశ్వరరావు సుబ్బరామరాజు సత్యనారాయణ జీవన్ గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు

## భారీ వర్షాలకు ప్రజలు,
# అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

♦ రానున్న 36 గంటల్లో భారీ వర్షాల అవకాశం
♦ అన్ని శాఖల అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలి
♦ జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్, జూలై 29,(ప్రజాజ్యోతి) రానున్న 36 గంటల్లో వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. భారీ వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి, భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమ కార్యాలయాలలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అక్కడ నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భారీ వరద ప్రవాహం సమయంలో నదులు, వాగులు, కాలువలు, చెరువులు వంటి జలవనరుల వద్దకు వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి ప్రవాహాన్ని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని సూచించారు. అలాగే రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటి సరఫరాకు



అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని కలెక్టర్ అన్నారు . గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రసవ సమయం సమీపించిన గర్భిణీలను ముందుగానే సమీప ఆసుపత్రులు లేదా గర్భిణీ వసతి కేంద్రాలకు తరలించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

## 90 మంది విద్యార్థులకు
# ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ

పినపాక, జూలై 29 (ప్రజాజ్యోతి) పినపాక మండలంలోని తోగ్గుడెం గ్రామంలోని జీఎస్ఎస్ చైల్డ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం 90 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ యుపిఎస్ తోగ్గుడెం ప్రధానోపాధ్యాయులు సతీష్ విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. విద్యార్థులు విద్యలో రాణించాలని వారు




ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పి. రాము, మురళీకృష్ణ రెడ్డి, తోగ్గుడెం సెంటర్ ఇన్‌చార్జ్ బడే సాగర్, ఉపాధ్యాయురాలు మైప రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేసిన
# జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం

♦ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
♦ ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు.జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్,అధికారుల తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.ఎన్ఎస్పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి,మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్







లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు.జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు,విద్య,వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ,గ్రామీణ,పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, సాంస్కృతిక వారసత్వం,పారిశ్రామిక అవకాశాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసిన అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాలకు హైదరాబాదు బయలుదేరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురు అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి

♦ దశలవారీగా ప్రతీ కుటుంబానికి మంజూరు ♦ రూ.21వేల కోట్లతో రైతన్నపై రుణభారం తగ్గించాం
♦ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం ♦ ఖమ్మం రూరల్ మండలంలో రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన

ఖమ్మం రూరల్ ప్రజాజ్యోతి : ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటనూ తూచా తప్పకుండా అమలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు సాగుతోందన్నారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఖమ్మం రూరల్ మండల పరిధిలో రూ.7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. డాక్యా తండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెం-- డాక్యా తండా రోడ్డు, పల్లెగూడెంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్.ఎస్.పీ. మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం 9 రోజుల్లోనే రూ.9,200 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రూ.2 లక్షల వరకు ఉన్న రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు రూ.21,000 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గించామని వివరించారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు





అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు.

**నాలుగు విడతల్లో :** నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలతో కలిపి ఇప్పటివరకు మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రెండో విడతలో మిగిలిన గ్రామాలకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని, రాబోయే మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతీ కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

**- మహిళా సాధికారతే ధ్యేయం :** రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆగిపోకుండా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి: మంత్రి పొంగులేటి

♦ రూ.4.85 కోట్లతో గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి శంకుస్థాపన
♦ పేద పిల్లలకు కార్పొరేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్య, వసతులు కల్పిస్తున్నామని వెల్లడి
♦ 'ఉద్దీపకం-3' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి : "ప్రభుత్వ విద్యా రంగంలో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను, అత్యుత్తమ వసతులను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టే ఖర్చే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.4.85 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు.

**- కార్పొరేట్‌కు ధీటుగా సర్కారు బడులు**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సర్కారు బడులను నాణ్యమైన విద్యకు నిలయాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు. గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో అదనపు వసతి గృహం, డైనింగ్ హాల్, ఆధునిక వంటగది, అదనపు తరగతి గదులు, టాయిలెట్ బ్లాక్‌లు, సోలార్ ఫెన్సింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్ వంటి మౌలిక వసతులు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. వీటి ద్వారా విద్యార్థినులకు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతావరణం లభిస్తుందన్నారు.

**- చదువే జీవితాన్ని మార్చే శక్తి**

తల్లిదండ్రులు పడే కష్టాన్ని గుర్తుంచుకుని విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. "పేదరికం కారణంగా ఏ ఒక్కరి చదువు ఆగకూడదనేదే ప్రభుత్వ సంకల్పం. చదువు మాత్రమే మనిషి జీవితాన్ని,



సమాజాన్ని మార్చగల శక్తి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ సొంత పిల్లల్లా భావించి, నాణ్యమైన విద్యతో పాటు మంచి నైతిక విలువలను అందించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు శ్రద్ధ చూపుతున్న ఐటీడీఏ అధికారులను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ రూపొందించిన 'ఉద్దీపకం-3' పుస్తకాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థుల చదువు పూర్తయ్యాక ఉపాధి కల్పనలో మార్గదర్శకత్వం వహించేందుకు 'వారధి' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు పీవో వెల్లడించారు. అనంతరం మంత్రి పాఠశాల విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపాలిటీ ఛైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దార్ వినయ్ చంద్ర రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

మొదటిపేజీ తరువాయి..

డైరక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్‌జెసి రామకృష్ణారావు, డిప్యూటి కమిషనర్ వినోద్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంఎ÷-లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవాళ గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతులు అందుకున్నవారితో కలిపి, గతంలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కేటగిరీల్లోనూ పదోన్నతులు ఇవ్వడం ద్వారా మొత్తం 168



మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారులుగా పదోన్నతి కల్పించి, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సరిగ్గా పది రోజుల క్రితం రవీంద్రభారతి వేదికగా వేదపండితులు, అర్చకులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులు తదితర 191 ధార్మిక నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడంతో పాటు అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి అర్చక కుటుంబాలకు మరింత భరోసా కల్పించామని మంత్రి తెలిపారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, గోదావరి పుష్కరాలు (2027), కృష్ణ పుష్కరాలు (2028) కోసం ఇప్పటికే ప్రణాళికాబద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు పుష్కరాలు అంటే తెలంగాణ అనే స్థాయిలో రానున్న పుష్కరాలు చేపడతామని మంత్రి సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేవాదాయ శాఖలో సంస్కరణల యుగానికి శ్రీకారం చుట్టామని, నియామకాలు, పదోన్నతులు, ఉద్యోగుల సంక్షేమం, భక్తులకు మెరుగైన సేవలు, ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో దేవాదాయశాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపచేస్తూ, దేవాదాయశాఖను మరో స్థాయిలో నిలబెట్టేలా కార్యక్రమాలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దశాబ్దాల నిరీక్షణకు తెరపడడంతో ఈవోలుగా పదోన్నతులు అందుకున్న ఉద్యోగులు భావోద్వేగానికి లోనయ్యారు. తమ ఉద్యోగ జీవితంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన గుర్తింపు లభించడంతో వారంతా మంత్రి కొండా సురేఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## లింగోజిగూడలో ఎమ్మెల్యే సుధీర్ పర్యటన

### వర్షాపునీటిలో డ్రైనేజీ కలవడంతో సమస్యలు

హైదరాబాద్,జూలై29(ప్రజాజ్యోతి): ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి లింగోజిగూడ డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో వర్షపు నీరు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు బుధవారం స్వయంగా పర్యటించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హనుమాన్ దేవాలయం సమీపంలో వర్షపు నీటిలో డ్రైనేజీ నీరు కలిసి రోడ్డుపై నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, నిల్వ నీటిని తొలగించినప్పటికీ కొద్దిసేపటికే మళ్లీ వరదనీరు చేరుతోందని ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి గారు సంబంధిత వాటర్ వర్క్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఇంద్ర నాగేంద్ర నుంచి ఎస్‌బీఐ బ్యాంక్ వరకు ఉన్న ట్రంక్ లైన్‌లో ఎక్కడైనా చెత్తాచెదారం పేరుకుపోయిందేమో పరిశీలించాలని ఆదేశించారు.
ధికారులు వెంటనే డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను తనిఖీ చేయగా, పలుచోట్ల చెత్తాచెదారం పేరుకుపోవడంతో డ్రైనేజీ ప్రవాహం నిలిచిపోయి, వర్షపు నీరు కాలనీలోకి చేరుతున్నట్లు గుర్తించారు. అనంతరం మ్యాన్‌హోల్స్ లోని చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరచడంతో భాగ్యనగర్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు సాఫీగా వెళ్లిపోయింది. సమస్యకు తక్షణ పరిష్కారం చూపిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా మ్యాన్‌హోల్స్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ నాయకులు తిలక్ రావు, కాలనీ అధ్యక్షులు రాము, జనరల్ సెక్రటరీ జగన్నాథ్ రెడ్డి, రాజు యాదవ్, జగన్మోహన్ గార్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై సర్కార్ నిర్లక్ష్యం

### వచ్చే అసెంబ్లీలో వీటిని ప్రస్తావిస్తా: వేముల

నిజామాబాద్,జూలై29(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి , బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనుల పెండింగ్ బిల్లుల విషయాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తుతా అని వెల్లడించారు. ముచ్కూర్, భీంగల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం దాత దయానంద్ రెడ్డి అందించిన సుమారు 2 లక్షల విలువైన 50 డ్యూయల్ డెస్క్ బెంచీలను గురువారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యాభివృద్ధికి సంబంధించిన అంశాల్లో రాజకీయాలు చేయడం తగదని స్పష్టం చేశారు. గురువుల ఆశీస్సులతోనే జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ముచ్కూర్‌లో కాంట్రాక్టర్లు సొంత నిధులతో శ్లాబ్ పనులు పూర్తి చేయగా వాటికి సంబంధించిన సుమారు రూ.30 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే దాతలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సయ్య, మాజీ జడ్పీటీసీ రవి, మాజీ ఎంపీపీ మహేష్, కౌన్సిలర్లు నీలం రవి, భగత్, నర్సాయ్యు, మ్లలెల ప్రసాద్, ముచ్కూర్ గ్రామ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## హైడ్రా ముసుగులో పేదల ఇళ్లు కూల్చివేత

హైదరాబాద్,జూలై29(ప్రజాజ్యోతి): హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తీసివేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు. హైడ్రాకు అందమైన భాష్యం చెప్పి తమ ఇష్టాలకు అనుగుణంగా వాడుకుంటూ పెద్దల భూములు రక్షించుకుంటూ.. పేదల ఇండ్లు కూలగొడుతూ ఎంతో మందిని రోడ్డున పడేశారని అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాకు ఈ విషయాలను వెల్లడించారు.

## తల్లిదండ్రుల చెంతకు చేరిన కిడ్నాప్ కు గురైన చిన్నారి

**6 గంటల్లో కిడ్నాప్ కేసును ఛేదించి సురక్షితంగా రక్షించి న జిల్లా పోలీసులు**

**జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్ర త్యేక బృందాల ముమ్మర గా లింపు, ఫలించిన కృషి**

**జిల్లా పోలీసులకు జీవి తాం తం రుణపడి ఉంటామని తల్లిదండ్రుల కితాబు**

**కిడ్నాప్ చేసిన మహిళ, అక్ర మంగా తన వద్ద చిన్నారిని ఉంచుకున్న మహిళ, ఇద్దరి అరెస్ట్**

**పోలీస్ ముఖ్య కార్యాల యంలో చిన్నారిని తల్లిదం డ్రులకు అప్పగించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

ఆదిలాబాద్ బ్యూరో, జూలై 29, (ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ జిల్లా తలమ దుగు మండలం రుయ్యడి గ్రామానికి చెందిన నాలుగు సంవత్సరాల చిన్నారి ఆత్రం గంగామణి కిడ్నాప్‌కు గురైన ఘటనలో జిల్లా పోలీసులు తక్షణమే స్పందించి 6 గంట ల్లోనే చిన్నారిని సురక్షితంగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.ఈ నెల 28వ తేదీన రుయ్యడి గ్రామానికి చెందిన నిందితురాలు నైతం నాగుబాయి చిన్నారిని కు టుంబ సభ్యులకు తెలియ కుండా ఆదిలాబాద్ పట్టణా నికి తీసుకువచ్చి బస్టాండ్ ప్రాంతంలో తనకు తెలిసిన భారతి అనే మహిళ నింది తురాలికి అప్పగించింది. బా ధితురాలి తల్లి ఆత్రం కప్లిబా యి తలమడుగు పోలీస్ స్టే షన్‌లో సాయంత్రం 5 గంట లకు ఫిర్యాదు చేయడంతో నిందితురాలిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి వెంటనే ద ర్యాప్తు ప్రారంభించారు.
జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్, ఐపీఎస్ ఆదేశాల మే రకు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి పర్యవేక్షణ లో రూరల్ సీఐ రహీం పా షా, రూరల్ ఎస్సై విష్ణువర్ధ న్, తలమడుగు ఎస్ ఐ డి. రాధిక, ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆదిలాబాద్, తాంసి తదితర ప్రాంతాల్లో విస్తృ తంగా గాలింపు చర్యలు చే పట్టాయి. బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, రహదారుల సీసీ టీవీ ఫుటేజీలను సేకరించి సాంకేతిక ఆధారాలతో అ న్వేషణ కొనసాగించారు.
ఎలాగైనా చిన్నారిని గుర్తిం చి తల్లిదండ్రులకు చేర్చాల ని జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్ ఐపిఎస్ ఆదేశాల మేర కు, పోలీసుల నిరంతర కృ షి ఫలించి గత రాత్రి 11 గం టలకు ఆదిలాబాద్ పట్టణం లోని మహాలక్ష్మి వాడలో చి న్నారి ఉన్నట్లు గుర్తించి సుర క్షితంగా రక్షించారు. అనంత రం బుధ వారం ఉదయం స్థానిక పోలీస్ ముఖ్య కా ర్యాలయంలో జిల్లా ఎస్పీ అ ఖిల్ మహాజన్, ఐపీఎస్ చి న్నారిని ఆమె తల్లిదండ్రు లై నా ఆత్రం జంగు, ఆత్రం కప్లీ బాయి లకు అప్పగించారు.
తప్పిపోయిన తమ కుమార్తె తిరిగి క్షేమంగా లభించడం తో చిన్నారి తల్లిదండ్రులు భావోద్వేగానికి గురై జిల్లా ఎ స్పీతో పాటు గాలింపు చర్య ల్లో పాల్గొన్న పోలీసు అధికా రులకు, సిబ్బందికి హృద యపూర్వక కృతజ్ఞతలు తె లిపారు. జిల్లా పోలీసుల త క్షణ స్పందన వల్లే తమ కు మార్తె తిరిగి దక్కిందని పే ర్కొంటూ జీవితాంతం రుణ పడి ఉంటామని తెలిపారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, పిల్లలు కనిపించకపోయినా లేదా అనుమానాస్పద పరి స్థితులు గమనించినా వెంట నే సమీప పోలీస్ స్టేషన్ కు లేదా డయల్-100కు స మాచారం అందించాలని ప్ర జలకు సూచించారు.కిడ్నాప్ చేసిన మహిళ నిందితురా లు నైతం నాగుబాయి, చట్ట వ్యతిరేకంగా తన వద్ద బా లికను ఉంచుకున్న గుమ్మడి వార్ భారతి (25) w/o సు నీల్ అనే మహిళను అరెస్టు చేసినట్లు తెలిపారు. గతం లో ఈ మహిళ భారతి పై, వ్యక్తిపై దాడి చేసిన కేసు, తన కుమార్తెను రిమ్స్ లో వదిలిపెట్టిన ఘటనలు న మోదైనట్లు తెలిపారు. బా లికను రక్షించడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సీ ఐ రహీం పాషా ఎస్ఐ లు రాధిక, విష్ణువర్ధన్, సిబ్బంది లాలు, మనోజ్, శ్రీనివాస్, సాగర్, సంతోష్, మౌనిక, గంగారం, నరేష్, శివకృష్ణ, ప్రతాప్, లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించా రు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీ వన్ రెడ్డి, తలమడుగు ఎస్ ఐ రాధిక, బాలిక తల్లిదం డ్రులు, గ్రామ సభ్యులు, సి బ్బంది తదితరులు పాల్గొ న్నారు.

## గడువులోగా ఎస్ ఐ ఆర్ డి జిటలైజేషన్ పూర్తి చేయాలి

**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధి కారి సుదర్శన్ రెడ్డి**

**97.15 శాతం డిజిట లైజేష న్ పూర్తి చేసిన ఆదిలాబాదు జిల్లా**

**బోథ్ నియోజకవర్గంలో వం ద శాతం ప్రక్రియ పూర్తి**

**కలెక్టర్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ఆదిలాబాద్ బ్యూరో, జూలై 29, (ప్రజా జ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ ఇం టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఎన్యుమ రేషన్ ఫారాల డిజి టలైజేషన్ ప్రక్రియను నిర్దేశి త గడువులోగా







పూర్తిచేయా లని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధి కారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ని ర్వహించిన ఆయన, ఎస్ ఐ ఆర్ డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రే షనలైజేషన్) పురోగతిని జి ల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, డిజిటలై జేషన్ ప్రక్రియను పూర్తిస్థా యి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుం డా నిర్వహించాలని సూచిం చారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పో లింగ్ కేంద్రాల్లో నమోదై ఉం టే, వారిని సాధ్యమైనంత వ రకు ఒకే పోలింగ్ కేంద్రం పరి ధిలోకి తీసుకువచ్చేలా రేష నలైజేషన్ ప్రక్రియను ఎన్నిక ల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టాలని ఆదేశిం చారు. పెండింగ్‌లో ఉన్న ప నులను గడువులోగా పూర్తి చేసి నివేదికలు సమర్పించా లని, ఖచ్చితమైన ఓటరు జాబితాల తయారీలో అధి కారులు బాధ్యతాయుతం గా వ్యవహరించాలని స్ప ష్టం చేశారు.కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో పా ల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ ఐ ఆర్ డిజిట లైజేషన్ ప్రక్రియ 97.15 శాతం పూర్త యిందని తెలిపారు. మిగిలి న ప్రక్రియను పూర్తి చేసేందు కు చర్యలు చేపట్టినట్లు చె ప్పారు. బోథ్ అసెంబ్లీనియో జకవర్గంలో డిజిటలై జేషన్ వంద శాతం, ఆదిలాబాదు నియోజకవర్గంలో 98.15 శాతం పూర్తయిందని వెల్ల డించారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధన లకు అనుగుణంగా పకడ్బం దీగా అమలు చేస్తామని తె లిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం స మావేశాలు నిర్వహిస్తూ ఎస్ ఐఆర్ ప్రక్రియపై పూర్తి వివ రాలు తెలియజేయడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేస్తున్నామని పేర్కొ న్నారు. అర్హులైన ప్రతి ఓట రు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అన్ని రాజకీ య పార్టీల సూచనలు, అభి ప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ పూర్తి పారద ర్శకతతో ఎస్ఐఆర్ ప్రక్రియ ను పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్ట ర్ (రెవెన్యూ) ఆర్.ఎస్. చి త్రు, డీఆర్‌వో స్రవంతి, ఆర్ డీఓ జగదీశ్వర్ రావు, ఎన్ని కల విభాగం పర్యవేక్షకురా లు నలంద ప్రియా, ఇతర అ ధికారులు, సిబ్బంది, తదిత రులు పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో భక్తిని చాటి..

# అన్నదానం చేసి..

**ప్రతి ఏటా మందిరంలో అన్నదానం నిర్వహిస్తున్న వడ్డీ శ్రీనివాస్ రెడ్డి- మంజుల దంపతులు**

అదిలాబాద్ టౌన్,జూలై 29 ( ప్రజాజ్యోతి): సేవాభావం కలిగి ఉండడం ఓ గొప్పవరమని ప్రజాజ్యోతి దినపత్రిక అధినేత వడ్డీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు.
అదిలాబాద్ పట్టణంలోని మహలక్ష్మి వాడ సాయిబాబా మందిరంలో బుధవారం గురు పౌర్ణమి పురస్కరించుకొని వడ్డీ శ్రీనివాస్ రెడ్డి- మంజుల దంపతులు ఉదయం సాయినాథునికి దూప దీప నైవేద్యాలతో పూజించి బాబా ఆశీర్వాదం



తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మందిరంలో కాలనీవాసులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని అన్నారు. గురుపౌర్ణిమ రోజున గురువులను దర్శించుకొని వారి ఆశీస్సులు పొందడం ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో పవిత్రమైన, గౌరవప్రదమైన సుదినమని పేర్కొన్నారు. అందువల్ల జ్ఞానాన్ని అందించి మంచి మార్గంలో నడిపించే గురువులను ఎల్లప్పుడూ స్మరించుకోవాలని, వారి బోధనలు జీవితానికి దిశానిర్దేశం చేస్తాయని చెప్పారు. సమాజంలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ప్రతి ఒక్కరూ గురువుల పట్ల కృతజ్ఞతాభావంతో ఉండాలని, సాయినాథుని ఆశీస్సులతో కాలనీవాసులు అందరూ బాగుండాలని ప్రార్థించారు. ప్రతి ఏటా అన్నదానం నిర్వహిస్తున్న వడ్డీ శ్రీనివాస్ రెడ్డి మంజుల దంపతులకు కాలనీవాసులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## జెన్ జీలపై కంగనా రనౌత్ వ్యాఖ్యలు సరికాదు

ముంబై,జూలై29(ప్రజాజ్యోతి): 'జెన్ జీ'లపై ప్రముఖ బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ చేసిన కామెంట్లపై నటుడు సోనూసూద్ స్పందించారు. 'జనరేషన్ గట్టర్' అంటూ కంగనా చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. కంగనా వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయని, ఆమె అలా మాట్లాడి ఉండాల్సింది కాదని సోనూసూద్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆమె ఏం మాట్లాడిందో నేను వినలేదు. యువత వల్లే నటులకి గుర్తింపు వస్తుంది. వారే మనల్ని ఈ ఉన్నత స్థానానికి చేరుస్తారు. జనాలు మనకు మద్దతుగా నిలిచినంత కాలమే మనం ఇక్కడ రాణించగలం. వారు లేకపోతే మన మనుగడ కష్టం' అని అన్నారు. కంగనా రనౌత్ జెన్ జీలను 'గట్టర్' అని సంబోధించిన విషయాన్ని రిపోర్టర్లు గుర్తు చేయగా.. కంగనా నిజంగానే అలా అని ఉంటే.. ఆమె వ్యాఖ్యలు చాలా అవమానకరం. కంగనా అలా మాట్లాడి ఉండాల్సింది కాదు. మనం ఏం మాట్లాడుతున్నామో చాలా జాగ్రత్తగా ఆలోచించుకోవాలి. ఎందుకంటే ప్రజలు దేవుడితో సమానం. మీ వృత్తి ఏదైనా కావచ్చు.. ప్రజలు మీతో కనెక్ట్ అయి ఉన్నంత వరకే ఈ ప్రపంచంలో మీ ఉనికికి విలువ ఉంటుంది' అని హితవు పలికారు.

# జోరు వానలు

మొదటిపేజీ తరువాయి..

హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమైన వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.హనుమకొండ, జె.భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనగాం, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీమ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి.
రాత్రి నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల్లోకి వరద పెరుగుతోంది. సిరికొండ మండలంలో కప్పల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్రిడ్జి వద్ద వరద ప్రవాహానికి అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. భారీ వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. గత 24 గంటల్లో ప్రాజెక్ట్‌లోకి 6585 క్యూసెక్కుల వరద నీరు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం1405 అడుగులు, 17.802 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 1395.40 అడుగులు, 7.139 టీఎంసీలుగా నమోదు అయ్యింది. గత సంవత్సరం ఇదే రోజు ప్రాజెక్ట్‌లో నీటిమట్టం 1391.25 అడుగులు, 4.597 టీఎంసీలుగా ఉన్న విషయం తెలిసిందే. అటు మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్ట్‌కు కూడా వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రాజెక్ట్ ఇన్ ఎ÷-లో 27,000 క్యూసెక్కులు, ఔవుట్ ఎ÷-లో 28000 క్యూసెక్కులుగా ఉంది. అలాగే ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లకు గాను.. ప్రస్తుత నీటిమట్టం 317.240 మీటర్లకు చేరింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి సామర్థ్యం 7.17 టీఎంసీలుగా నమోదు అయ్యింది. వరద ప్రవాహం నేపథ్యంలో ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లో 10 యూనిట్లలో 395 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియా కల్యాణిఖని ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. నిర్మల్ జిల్లాలో కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లక్ష్మణచాందా మండలం కనకాపూర్ వాగు ఉప్పొంగడంతో పీచార నుంచి సోన్ మధ్య రాకపోకలు నిలిచాయి. కడెం మండలం కుర్రగూడెం, పాత రేవోజీపేటలో తాత్కాలిక వంతెన తెగిపోయింది. దీంతో ఆ ప్రాంతం మధ్య రవాణా నిలిచిపోయింది. ఎగువ నుంచి వరద ప్రవాహం వస్తుండడంతో కడెం, స్వర్ణ జలాశయాల్లోకి వరద నీరు చేరుతోంది. భారీ వర్షాల కారణంగా మంచిర్యాల జిల్లాలోని మందమర్రి, చెన్నూర్, జైపూర్ మండలాల్లో వాగులు ఉప్పొంగాయి. మందమర్రి మండలంలోని తుర్కపల్లిలో వాగు పొంగిపొర్లడంతో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షం కురవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పద్మశాలి భవన్ రోడ్డులో భారీ చెట్టు నేల కూలడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలో భారీ వర్షానికి



ఎర్రకుంట చెరువుకు గండి పడింది. రైల్వే స్టేషన్ ఏరియాలోని హనుమాన్ గుట్ట కింద ఉన్న భవనాలు నీట మునిగి పోయాయి. ఇటీవలే ఈ చెరువును రూ.23 లక్షలతో మరమ్మతులు చేయించడం గమనార్హం.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా నిన్నటి నుంచి ఏకధాటిగా భారీ వర్షం కురుస్తోంది. భద్రాచలం దుమ్ముగూడెం, చర్ల , బూర్గంపాడు మండలాల్లో కుండపోత వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. ఇల్లందు సింగరేణి ఏరియా కోయగూడెం ఉపరితల గనిలో వర్షం కారణంగా 3 టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లింది. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఓబి పనులు ప్రారంభం కాలేదు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వర్షం దంచికొట్టింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన జోరువానకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షానికి పలుచోట్ల రోడ్లు తెగిపోవడంతో పాత ఇళ్లు కూలిపోయాయి. డిచ్‌పల్లి, మాక్లూరు రూరల్, ధర్పల్లి, జుక్కల్ మండలాల్లో అత్యధికంగా 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బోధన్‌లోని ఆటోనగర్, ప్రెస్ కాలనీలతోపాటు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి కురిసిన వానకు జలకళను సంతరించుకున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 4,051 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.ఉమ్మడి మెదక్ జిల్లాపై మంగళవారం సాయంత్రం నుంచి వరుణుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హవేలీఘనపూర్ మండలంలో ధూప్ సింగ్ తండా వాగు ఉప్పొంగుతుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వన దుర్గ భవాని మాత సమీపంలో ఉన్న వనదుర్గ ఆనకట్ట పొంగిపొర్లుతోంది. ఆనకట్ట అలుగు పారుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వరి నాట్లు జోరందుకున్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక మండలాల్లో భారీ వర్షం కురిసింది. కుండపోత వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. కూడవెల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉదయం నుంచి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సింగరేణి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. భూపాలపల్లి సింగరేణిలోని కాకతీయ ఖని-2, 3 ఉపరితల గనుల్లో పనులు నిలిచిపోయాయి. కోల్ బెంచ్‌లోకి వరద నీరు చేరడంతో బ్లాస్టింగ్ చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో బొగ్గు ఉత్పత్తికి సంబం ధించిన పనులను ఆపివేశారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో వర్షాలు కురిశాయి. జగిత్యాల జిల్లా ధర్మపురి, వెలగటూరు, గొల్లపల్లి, సారంగాపూర్, బుగ్గారం మండలాల్లో రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. నేరెళ్ల వద్ద 63వ జాతీయ రహదారిపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జగిత్యాల - ధర్మపురి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967